సోమవారం
14-11-2022
విజయవాడ ప్రచురణ
సంపుటి : 71, సంచిక : 142
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

డల్లాస్ ఎయిర్‌షోలో విషాదం

అమెరికా ఎయిర్‌షోలో విషాదం చోటుచేసుకుంది. విన్యాసాలు జరుగుతున్న సమయంలో గాల్లోనే రెండు యుద్ధ విమానాలు ఒకదానికొకటి ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఆరుగురు సిబ్బంది మరణించినట్లు నివేదికలు చెబుతున్నాయి.

2లో

బీజేపీకి తిరుగుబాటు బెడద

గుజరాత్‌లో టికెట్ల పంపిణీపై సొంత నేతల అసంతృప్తి

- స్వతంత్ర అభ్యర్థులుగా పోటీకి సిద్ధమని ప్రకటనలు
- బుజ్జగింపు యత్నాల్లో పార్టీ రాష్ట్ర నాయకత్వం

అహ్మదాబాద్: గుజరాత్ బీజేపీలో అసంతృప్తి జ్వాల రగిలింది. అసెంబ్లీ ఎన్నికలకు సమయం దగ్గరపడుతుండగా సొంత పార్టీ నేతలు తిరుగుబాటు బావుటా ఎగురు వేస్తుండటంతో కాషాయ పార్టీ చిక్కుల్లో పడింది. నేతలను బుజ్జగించే ప్రయత్నాల్లో నిమగ్నమైంది. అయితే టికెట్లు ఆశించి భంగపడ్డ నేతలు స్వతంత్ర అభ్యర్థులుగా పోటీకి సిద్ధమయ్యారు. కొందరు ఇప్పటికే నామినేషన్లు దాఖలు చేయగా మరికొందరు అందుకు రంగం సిద్ధం చేసుకున్నారు. తమను కాదని ఇతరులకు టికెట్లు ఇవ్వడంతో ఒక సిట్టింగ్ ఎమ్మెల్యే, నలుగురు మాజీ శాసనసభ్యులు బీజేపీకి రెబెల్స్‌గా మారారు. తమ మద్దతుదారులతో సంప్రదింపులు జరిపి తదుపరి చర్యలను ప్రకటిస్తామని చెప్పారు. బీజేపీ మాజీ ఎమ్మెల్యే, గిరిజన నేత హర్షద్ వాసవా ఇప్పటికే నాందోడ్ స్థానం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. ఇది ఎస్టీ రిజర్వుడ్ సీటు. గుజరాత్ బీజేపీ షెడ్యూల్డ్ తెగ మోర్చా అధ్యక్షుడిగా ఉన్న వాసవా 2002-07, 2007-12 వరకు రాజ్‌పిప్లా స్థానానికి ప్రాతినిధ్యం వహించారు. నర్మదా జిల్లాలోని నాందోడ్ స్థానం ప్రస్తుతం కాంగ్రెస్ పరిధిలో ఉంది. ఈ స్థానం నుంచి దర్శన దేశ్‌ముఖ్‌ను బీజేపీ నిలబెట్టింది. దీంతో నిరాశ చెందిన వాసవా బీజేపీలో తన పదవికి రాజీనామా చేశారు. శుక్రవారం నాందోడ్ స్థానం నుంచి నామినేషన్ వేశారు. ఆయన మాట్లాడుతూ 'రాష్ట్రంలో అసలు బీజేపీ, నకిలీ బీజేపీ ఉన్నాయి. నిబద్ధతతో పనిచేసే కార్యకర్తలను పక్కనుపెట్టివేసి కొత్తవారికి కీలక పదవులు కట్టబెట్టిన వారి గురించి బయటపెడతాం. నా రాజీనామాను పార్టీకి పంపాను. ఈ ప్రాంత ప్రజలకు నేను చేసిన పని గురించి బాగా తెలుసు. 2002 నుంచి 2012 వరకు ఎమ్మెల్యేగా ఉన్నాను' అని నామినేషన్ పత్రాలను సమర్పించిన అనంతరం విలేకరులతో మాట్లాడిన వాసవా అన్నారు.

ఆశావహులు, వడోదర జిల్లాలో సిట్టింగ్ ఎమ్మెల్యేతో పాటు ఇద్దరు బీజేపీ ఎమ్మెల్యేలు కూడా తమ అసంతృప్తిని వ్యక్తంచేశారు. వఘోడియా నుంచి ఆరుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన మధు శ్రీవాత్సవకు టికెట్ దక్కలేదు. దీంతో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ

- మిగతా 2 లో

జగజ్జేత ఇంగ్లండ్

- ఫైనల్లో ఐదు వికెట్ల తేడాతో పాక్‌పై గెలుపు
- మరోసారి టీ20 ప్రపంచకప్ కైవసం

మొదటి మ్యాచ్‌లో క్లిష్టమైన గెలుపు, రెండు, మూడు మ్యాచ్‌లకు వరుణుడు అడ్డుపడటంతో ఇంగ్లండ్ ఒకింత భయపడింది. అయితే కివీస్‌పై వచ్చిన విజయంతో ఇక జట్టు వెనుదిరిగి చూడక్కర్లేదనుకున్న సమయానికి ఓటమి శ్రీలంక రూపంలో దాడి చేసింది. దాని నుంచి బయటపడి... ఓటమి కసితో భారత్‌పై విజయదుందుభి మోగించిన ఇంగ్లండ్... ఫైనల్‌లోనూ అదే ఊపు కొనసాగించింది. పాకిస్తాన్ జట్టుపై ఐదు వికెట్ల తేడాతో ఘన విజయం సాధించి మరోసారి టీ20 ప్రపంచకప్‌ను సాధించింది. బెన్‌స్టోక్స్ అర్థసెంచరీతో రాణించగా, సామ్ కరన్ చెలరేగడంతో పాకిస్తాన్‌ను తక్కువ స్కోరుకే బౌట్ చేసింది. అనంతరం ఛేదనలో తడబడినా, లక్ష్యాన్ని సునాయాసంగా చేరుకుంది.

వలసల బండి కదిలింది

- ఆస్పరి నుంచి తెలంగాణకు
- దళిత కాలనీలో 150 కుటుంబాలు
- పిల్లలతో సహా భారీగా వెళ్లిన కూలీలు

గ్రామాల్లో ఉపాధి, వ్యవసాయ పనులు అంతంత మాత్రంగా ఉండడంతో కూలీలు పొట్టకూటి కోసం కుటుంబాలు, పిల్లలతో కలిసి వలస బాట పడుతున్నారు.

2లో

పెరిగిన డ్రాపౌట్లు

- బడికెళ్లని 43శాతం మంది పిల్లలు
- కరోనా వేళ 19 నెలలు చదువు లేదు

న్యూఢిల్లీ: కోవిడ్ మహమ్మారి విజృంభణ వేళ దేశం చాలా రకాల సమస్యలతో బాధపడింది. ఆరోగ్య సంక్షోభం నెలకొనడంతో అన్ని వ్యవస్థలపై ప్రభావం కనిపించింది. ముఖ్యంగా విద్యార్థులు దాదాపు 19 నెలల పాటు చదువుకు దూరమయ్యారు. కనీసం 43శాతం మంది పిల్లలు బడికి వెళ్లలేదు. పరిస్థితులు అనుకూలించని కారణంగా డ్రాపౌట్ల సంఖ్య పెరిగింది. 1.3శాతంగా ఉండే డ్రాపౌట్లు మహమ్మారి కాలంలో 43.5శాతానికి

- మిగతా 2 లో

తెలుగు రాష్ట్రాలకు

మోదీ ఏం చేశారు?

- అడుగడుగునా అన్యాయం
- పోలవరం, ప్రత్యేక హోదాపై నిర్లక్ష్యం
- ఆంధ్రాలో బీజేపీ బలపడాలనేది వ్యూహం
- సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ప్రధానమంత్రి మోదీ అలా వచ్చారు...ఇలా వెళ్లారనీ, తెలుగు రాష్ట్రాలకు ఏం చేశారని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ ప్రశ్నించారు. పోలవరం, ప్రత్యేక హోదా లాంటి విభజన హామీలను అమలు చేయకుండా, అడుగడుగునా ఆంధ్రప్రదేశ్‌కు కేంద్రం తీవ్ర అన్యాయం చేస్తోందన్నారు. సీపీఐ జాతీయ సమితి సభ్యులు పల్లా వెంకట్ రెడ్డి, ఈ.టి.నర్సింహాతో కలిసి హైదరాబాద్ మఖ్దూంభవన్‌లో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మోదీ రాకతో తెలుగు రాష్ట్రాలకు ఏం ఒరిగిందని నిలదీశారు. వైసీపీ బలంగా ఉండాలని, టీడీపీ బలహీనంగా ఉంటేనే బీజేపీ బలపడుతుందన్నది ప్రధాని ఉద్దేశమన్నారు. మోదీ ప్రభుత్వం కాంట్రాక్ట్, ప్రైవేటీకరణ విధానాలతో సింగరేణి సంస్థను బతికి ఉండగానే చంపేందుకు ప్రయత్నిస్తోందన్నారు. జలగ నొప్పి లేకుండా రక్తాన్ని ఎలా పీలుస్తుందో, మోదీ కూడా సింగరేణి సంస్థ రక్తాన్ని పీలుస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. మోదీ పర్యటన రాజకీయ దురుద్దేశంతో కూడిందే తప్ప తెలుగు రాష్ట్రాల అభివృద్ధికి ఉపయోగపడలేదన్నారు. అవినీతి కుంభకోణానికి మోదీ ప్రభుత్వమే నాయకత్వం వహిస్తోందన్నారు. తమ కార్యాలయం లోపలికి ఎప్పుడు రాని పోలీసులు మోదీకి వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేస్తే మాత్రం లోపలికి వచ్చారని, ఇంతకు ఈ పోలీసులు మోదీకి చెందిన కేంద్రబలగాలా?, లేదా కేసీఆర్ పోలీసులా?, అనేది కేసీఆర్ తేల్చుకోవాలని సూచించారు. బీజేపీని తెలంగాణలో అభివృద్ధి చేసుకునేందుకు, మనుగోడులో బీజేపీ ఓడిపోయిన నేపథ్యంలో ఆపార్టీ శ్రేణులు నిరాశచెందకుండా ఉండేందుకే మోదీ తెలంగాణ రాష్ట్ర పర్యటనకు

- మిగతా 2 లో

విభజన హామీల సాధనకు

మరో ఉద్యమం

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ
- 16 నుంచి నిరసనలు, ఆందోళనలు
- 26న ఢిల్లీలో ధర్నాకు పిలుపు

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్): విభజన హామీలు అమలు చేయడంలో కేంద్రంలోని మోదీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ విమర్శించారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో అదివారం విభజన హామీల సాధన సమితి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, విభజన హామీల అమలుకు రాష్ట్ర వ్యాప్తంగా మరో సారి పెద్దఎత్తున ఆందోళనలు నిర్వహిస్తామన్నారు. ఈ నెల 16 నుంచి 26 జిల్లాల్లోనూ నిరసనలు, సభలు, సమావేశాలు నిర్వహించాలని, 26న దిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ధర్నా చేపట్టాలని నిర్ణయించామని తెలిపారు. ప్రధాని విశాఖ పర్యటనలో ఆంధ్రప్రదేశ్‌కు మరోసారి మొండిచేయి చూపారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వ నిధులతో లక్షలాది మందిని తరలించి స్వామి భక్తిని చాటుకున్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్రానికి మేలు జరిగే ఏ ఒక్క అంశంపైగాని, సీఎం ప్రస్తావించిన వాటిపై కాని మోదీ సమాధానం చెప్పలేదన్నారు. విశాఖ సభ విజయవంతం కోసం దాదాపు 7 వేల మంది అధికారులను వినియోగించారని అన్నారు. జన సమీకరణకు కోట్లాది రూపాయల ప్రజాధనం ఖర్చు పెట్టి రాష్ట్రానికి సాధించిందేమిటో ప్రజలకు సీఎం జగన్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సభలో కనీసం సీఎం జగన్ పేరు కూడా ప్రధాని ఎత్తలేదని ఇంకా మోదీ భజన ఎందుకని నిలదీశారు. మోదీ ప్రసన్నం కోసం జగన్ పడరాని పాట్లు పడుతున్నారన్నారు. అదే ప్రధాని, తెలంగాణలో టీఆర్ఎస్, కాంగ్రెస్‌కు భయపడి సింగరేణిని ప్రైవేట్‌పరం చేయం అని చెప్పారన్నారు. ఇక్కడ మాత్రం విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ చేయబోమని ఎందుకు చెప్పలేదు అని ప్రశ్నించారు. పార్లమెంటు సభ్యులను ఎక్కువ మందిని గెలిపిస్తే కేంద్రం మెడలు వంచి ప్రత్యేక హోదా సాధిస్తానని, విభజన అంశాలు అమలయ్యేలా కృషి చేస్తానని 2019 ఎన్నికల్లో జగన్ ప్రగల్భాలు పలికారనీ, ఇప్పుడేమో తన కేసుల విముక్తి కోసం రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టుపెట్టి ప్రధాని మోదీ ఎదుట సాగిలపడే పరిస్థితికి దిగజారారని రామకృష్ణ విమర్శించారు. మోదీని సార్...సార్ అని అటెండర్ మాదిరి అంటూ జగన్ ప్రజల ఆత్మగౌరవాన్ని దిగజార్చారన్నారు. అంతగా బతిమాలినా విశాఖ రైల్వే జోన్, ఉక్కు ప్రైవేటీకరణ, విభజన హామీలు అమలు చేసే అంశాలు ఏ ఒక్కదానిపై కూడా ప్రధాని తన ప్రసంగంలో కనీసం ప్రస్తావించలేదన్నారు.

విభజన హామీల సాధన సమితి అధ్యక్షుడు చలసాని శ్రీనివాస్ మాట్లాడుతూ, మోదీ సభకు లక్షలాది మంది ప్రజలను బలవంతంగా తరలించారన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరించటాన్ని

- మిగతా 2 లో



నిరసన సెగ

- దిక్కుతోచని స్థితిలో ఐరాస వాతావరణ సదస్సు
- పర్యావరణ కార్యకర్తల అసహనం
- 'బ్లూజోన్'లో వందలాది మందితో భారీ ప్రదర్శన

షర్మల్ షేక్: ఈజిప్టులోని షర్మల్‌షేక్‌లో జరుగుతున్న ఐక్యరాజ్య సమితి వాతావరణ సదస్సు (సీఓపీ 27)ను నిరసన సెగ తాకింది. పర్యావరణ కార్యకర్తలు వందల సంఖ్యలో ఆందోళనలో పాల్గొన్నారు. గ్లోబల్ వార్మింగ్‌కు మూల్యం చెల్లించాలని పారిశ్రామిక దేశాలను ముక్తకంఠంతో డిమాండ్ చేశారు. సదస్సు ప్రాంగణంలోని బ్లూజోన్‌లో భారీ ప్రదర్శనను నిర్వహించారు. వాస్తవానికి ఇది నిషిద్ధ ప్రాంతం. అధికారిక కార్యకలాపాలకు మాత్రమే అనుమతి ఉంటుంది. వీధుల్లో ఆందోళనలకు ఈజిప్టు అధికారులు అనుమతివ్వరు కాబట్టే సదస్సు ప్రాంగణంలోనే ప్రదర్శన చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు. 'మానవ హక్కులు లేకుండా వాతావరణానికి న్యాయం జరగదు', 'ఆఫ్రికాను రగల్చకండి', 'పర్యావరణ రుణాలు చెల్లించండి' అంటూ నిరసనకారులు నినాదాలు చేశారు. ఐరాస వాతావరణ సదస్సు దిక్కుతోచని స్థితిలో ఉన్నదన్నారు. మానవహక్కులు-పర్యావరణ న్యాయంపై ఎప్పటికీ ఓడిపోమన్న థీమ్‌తో నిరసన జరిగింది. జైల్లో ఉన్న బ్రిటిష్-ఈజిప్టుకు చెందిన వాటర్ స్ట్రైకర్ అలా అబ్దెల్-ఫత్తా సోదరి సనా సేఫ్ ఆధ్వర్యంలో ప్రదర్శన జరిగింది. 'అధికారంలో ఉన్న

- మిగతా 2 లో

2లో

జామకు పండు ఈగ

- 300 ఎకరాల్లో దెబ్బతిన్న పంట
- ఆందోళనలో రైతులు
- ప్రభుత్వమే ఆదుకోవాలని విజ్ఞప్తి

డల్లాస్ ఎయిర్‌షోలో విషాదం

గాల్లోనే ఢీకొన్న రెండు యుద్ధ విమానాలు

ఆరుగురు సిబ్బంది మృతి

డల్లాస్ : అమెరికా ఎయిర్‌షోలో విషాదం చోటుచేసుకుంది. విన్యాసాలు జరుగుతున్న సమయంలో గాల్లోనే రెండు యుద్ధ విమానాలు ఒకదానికొకటి ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఆరుగురు సిబ్బంది మరణించినట్లు నివేదికలు చెబుతున్నాయి. ఈ దుర్ఘటన టెక్సాస్‌లోని డల్లాస్ ఎగ్జిక్యూటివ్ ఎయిర్‌పోర్ట్‌లో శనివారం జరిగింది. దీనిపై దర్యాప్తునకు ఏవియేషన్ అధికారులు ఆదేశాలిచ్చారు. బి-17 బాంబర్ యుద్ధ విమానాన్ని చిన్న విమానం బెల్ పి-63 కింగ్ కోబ్రా ఢీకొట్టింది. కిందపడిన వెంటనే విమానాలు ముక్కలయ్యాయి. కొన్ని క్షణాల్లోనే ఇదంతా జరిగిపోయింది. గాయపడిన పైలట్ల పరిస్థితి విషమంగా ఉన్నట్లు యూఎస్ ఫెడరల్ ఏవియేషన్ అధికారులు తెలిపారు. రెండు విమానాలు అగ్నిగోళాల్లా మారిపోవడం కెమెరాల్లో రికార్డు అయింది. ఎయిర్‌షోకు హాజరైన వారు ఈ ఘటనకు సంబంధించిన దృశ్యాలను సామాజిక మాధ్యమాల్లో పెట్టడంతో ఆ వీడియోలు వైరలయ్యాయి. డల్లాస్ ఎగ్జిక్యూటివ్ ఎయిర్‌పోర్ట్‌లో ఎయిర్‌షో సమయంలో తక్కువఎత్తులో ఎగురుతున్న రెండవ ప్రపంచ యుద్ధం నాటి బీ17 యుద్ధ విమానాన్ని బెల్ పీ-63 కింగ్‌కోబ్రా ఢీకొట్టింది. బీ-17 యుద్ధ విమానంలో నాలుగు ఇంజిన్లు ఉంటాయి. రెండో ప్రపంచ యుద్ధంలో జర్మనీతో జరిగిన పోరులో కీలక పాత్ర పోషించింది. ఈ విమానం ఇప్పటివరకు అత్యధికంగా ఉత్పత్తి చేసిన బాంబర్‌లలో ఒకటి. మరోవైపు పి-63 కింగ్‌కోబ్రా అనేది బెల్ ఎయిర్‌క్రాఫ్ట్ అభివృద్ధి చేసిన యుద్ధ విమానం. దీనిని సోవియట్ వైమానిక దళం ఉపయోగించింది. ఈ ఘటనపై డల్లాస్ మేయర్ ఎరిక్ జాన్సన్ ట్విట్టర్‌లో స్పందిస్తూ 'మీరు చూస్తున్న వీడియో మా నగరంలో ఎయిర్‌షో సందర్భంగా జరిగిన విషాదానికి సంబంధించినది. పూర్తి వివరాలు ధ్రువీకరించలేదు. జాతీయ రవాణా భద్రతా బోర్డు... బోర్డ్ డల్లాస్ పోలీస్ విభాగంతో కలిసి దర్యాప్తు చేపట్టింది. డల్లాస్ అగ్నిమాపక సిబ్బంది సహాయాన్ని అందిస్తున్నారు' అని పేర్కొన్నారు.

నేడు బ్రస్సెల్స్‌లో కేకేఈ నిరసన

బ్రస్సెల్స్: పోర్టు వర్కర్ల శ్రమదోపిడీకి వ్యతిరేకంగా సామ్రాజ్యవాద యుద్ధంపై సోమవారం బ్రస్సెల్స్‌లోని యూరోపియన్ పార్లమెంటు వద్ద నిరసనసభకు గ్రీస్ కమ్యూనిస్టు పార్టీ (కేకేఈ) యూరోపియన్ యూనియన్ పిలుపునిచ్చింది. సామ్రాజ్యవాద యుద్ధానికి వ్యతిరేకంగా జెనోవా, ఇటలీ పోర్టు వర్కర్లు పాల్గొనున్నారు. సభలో కేకేఈ ఎంఈపీ కోస్టాస్ పపదాస్కిస్ ప్రారంభోపన్యాసం చేస్తారు. పిరాయూస్ పోర్టు కోస్కో వర్కర్ల యూనియన్ అధ్యక్షుడు మార్కోస్ బెక్రిస్, యూఎస్‌బీ (ఇటలీ) డాక్‌వర్కర్ల జాతీయ కమిటీ సభ్యుడు, జెనోవా పోర్టు డాక్ వర్కర్ల అధ్యక్షుడు జోసేనివోయి, ఫ్రాన్స్, సీజీటీ డాక్‌వర్కర్ల జాతీయ సమాఖ్య ప్రధాన కార్యదర్శి టోని హౌబోయిట్ ప్రసంగిస్తారు. కేకేఈ ఎంఈపీ లెఫ్టిరిస్ నికోలావో-అలవానోస్ వందన సమర్పణ చేస్తారు.

కాలువలో పడిన మినీబస్సు

22 మంది దుర్మరణం- మరో ఏడుగురికి గాయాలు

మృతుల్లో ముగ్గురు చిన్నారులు-ఆరుగురు మహిళలు

ఈజిప్టులో ఘోర ప్రమాదం

కైరో: ఈజిప్టులోని ఉత్తర దకాలియా ప్రావిన్స్‌లో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. మినీబస్సు కాలువలో పడి 22 మంది దుర్మరణం చెందారు. మరో ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు. మృతుల్లో ముగ్గురు చిన్నారులు, ఆరుగురు మహిళలు ఉన్నట్లు ఆరోగ్య మంత్రిత్వ శాఖ అధికారి డాక్టర్ షెరీఫ్ మకీన్ తెలిపారు. కైరో రాజధానికి ఈశాన్యంగా 100 కిలోమీటర్ల (62 మైళ్లు) దూరంలో ఉన్న దకాహ్లియా ప్రావిన్స్‌లో ఈ ప్రమాదం జరిగిందని మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. నైలు నది డెల్టా ప్రాంతంలో అల్ రయా అల్ తౌఫికి కెనాల్‌లోకి మినీబస్సు దూసుకెళ్లింది. గాయపడిన ప్రయాణికులను స్థానిక ఆసుపత్రికి తరలించారని పేర్కొంది. ఘటనాస్థలికి మొత్తం 18 అంబులెన్స్‌లతో పాటు సహాయక బృందాలను పంపినట్లు తెలిపింది. నీటి నుంచి మృతదేహాలను బయటకు తీయడానికి పోలీసులకు స్థానికులు సహాయం చేశారు. దీనికి సంబంధించిన వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరలయ్యాయి. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో 46 మంది ప్రయాణికులు ఉన్నారు. విద్యార్థులు ఎక్కువ మంది గాయపడ్డారని అధికారులు తెలిపారు.

పంపుసెట్లకు విద్యుత్ మోటార్లొద్దు

ఏపీ రైతు సంఘం అధ్యక్షుడు రామచంద్రయ్య

విశాలాంధ్ర-ఎమ్మిగనూరు: రైతులు వినియోగిస్తున్న పంపుసెట్లకు విద్యుత్ మోటర్లు అమర్చే విధానానికి రాష్ట్ర ప్రభుత్వం స్వస్తి పలకాలని, లేనిపక్షంలో గుణపాఠం తప్పదని ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి. రామచంద్రయ్య హెచ్చరించారు. కర్నూలు జిల్లా ఎమ్మినూరులో ఆదివారం ఏఐకేఎస్ జిల్లా సమితి సమావేశాన్ని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేశారు. ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు లక్ష్మిరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో రామచంద్రయ్య, సంఘం జిల్లా కార్యదర్శి కె.జగన్నాథం మాట్లాడుతూ, రాష్ట్రంలో ఈ ఏడాది సకాలంలో వర్షాలు కురవడంతో పత్తి, ఉల్లి, మిరప, వేరుశనగ, కంది, ఆముదం, టమాటా పంటలు విస్తారంగా సాగు చేశారని చెప్పారు. పంటలు ఏపుగా పెరిగి చేతికి వచ్చే దశలో అధిక వర్షాల వల్ల మునిగి కుళ్ళిపోవడం జరిగిందని తెలిపారు. పత్తికాయలు నేలపాలయ్యాయనీ, గులాబి రంగు తెగులు వచ్చిందన్నారు. మిరప పూత రాలిపోయిందనీ, ఉల్లి, వేరుశనగ పంటలకు ఎకరాకు రూ. 40వేల నుంచి లక్ష వరకు పెట్టుబడి పెట్టినట్టు చెప్పారు. అధిక శాతం పంట నష్టం జరిగినా వ్యవసాయ అధికారులు పరిశీలనకు రాకపోవడం దుర్మార్గమని అన్నారు. రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారని , తక్షణమే పంట నష్టపరిహారం చెల్లించాలనీ, బీమా పథకం పూర్తిస్థాయిలో వర్తింపచేయాలని డిమాండ్ చేశారు. వేదవతి, గుండ్రేవుల, ఆర్డీఎస్ కాలువ పెండింగ్ పనులు పూర్తి చేయాలన్నారు. రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శిలు పంపన్న గౌడ్, సత్తన్న, గోపాల్, కారన్న, విరుపాక్షి, చిన్నన్న, జబ్బర్, హనుమంతు, సీపీఐ పట్టణ కార్యదర్శి జీ రంగన్న, జిల్లా కార్యవర్గ సభ్యుడు భాస్కర్ యాదవ్, 50 మంది కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ ప్రవేశాలకు తుది గడువు నేడు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలోని ఇంజినీరింగ్ కళాశాలల్లో స్పాట్ వెబ్ కౌన్సెలింగ్ ద్వారా కన్వీనర్ కోటాలో సీట్లు పొందిన అభ్యర్థుల ప్రవేశాలకు సోమవారంతో గడువు పూర్తి కానుంది. అభ్యర్థులు తొలుత ఆన్‌లైన్లో ఏపీఈఏపీసెట్-2022 కన్వీనర్ వెబ్‌సైట్లో రిపోర్టింగ్ చేసి, ఆ తర్వాత ఆ ప్రతిని డౌన్‌లోడ్ చేసుకోవాలి. వాటితోపాటు అభ్యర్థికి ఖరారు చేసిన కళాశాల, బ్రాంచితో కూడిన ఎలాట్‌మెంట్ లెటరుతో సంబంధిత కళాశాలకు వెళ్లి వ్యక్తిగతంగా రిపోర్టు చేయాలి. ఆ సమయంలో విద్యార్థులు ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాలు, అడ్మిషన్ ఫీజు చెల్లించాలి. ఏపీ ఈఏపీసెట్ స్పెషల్ రౌండ్ వెబ్ కౌన్సెలింగ్ సీట్లను ఈనెల 11న ప్రకటించారు. సెల్ఫ్ రిపోర్టింగ్‌కు 14 వరకు గడువు ఇచ్చారు. ఇప్పటికే రెండు విడతల కౌన్సెలింగ్ ప్రక్రియ పూర్తవ్వడంతో... ఇంజినీరింగ్ తరగతులు ప్రారంభమయ్యాయి. స్పెషల్ రౌండ్ అయ్యాక కూడా కన్వీనర్ కోటా కింద 23 వేలకుపైగా సీట్లు భర్తీకాకుండా ఉండిపోయాయి. ఎక్కువ మంది విద్యార్థులు కంప్యూటర్, అనుబంధిత కోర్సులపైనే దృష్టి పెట్టడంతోనే ఈ పరిస్థితి నెలకొంది.

ఈ గిరిపుత్రుడు అమెరికా మెచ్చిన శాస్త్రవేత్త

నాగ్‌పూర్: మహారాష్ట్ర గడ్చిరోలి జిల్లాలోని మారుమూల గ్రామంలో పుట్టిన ఓ గిరిజన బాలుడు... ఒకప్పుడు కడుపు నింపుకోడానికి నానా అవస్థలు పడ్డాడు. ప్రస్తుతం అతడు అమెరికాలో సీనియర్ శాస్త్రవేత్తగా అందరి ప్రశంసలు అందుకుంటున్నాడు...ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నారు. ఆయనే భాస్కర్ హలామీ... కృషి, దృఢచిత్తం ఉంటే ఏదైనా సాధించవచ్చని ఆయన నిరూపించారు. కుర్ఖెడా తహసీల్లోని చిర్చాడీ గ్రామంలో గిరిజన పేద కుటుంబం నుంచి వచ్చిన భాస్కర్ హలామీ... ప్రస్తుతం అమెరికాలోని మేరీల్యాండ్ రాష్ట్రంలో ఉన్న బయో ఫార్మా కంపెనీ సిర్నామోమిక్స్‌ఇంక్ పరిశోధన, అభివృద్ధి విభాగంలో సీనియర్ శాస్త్రవేత్తగా విధులు నిర్వహిస్తున్నారు. ఆర్‌ఎన్‌ఏ ఉత్పత్తికి సంబంధించిన కార్యకలాపాలను పర్యవేక్షిస్తున్నారు. ఈ సంస్థ జన్యుపరమైన ఔషధాలపై పరిశోధనలు నిర్వ హిస్తుంది. భాస్కర్ ఈ స్థాయికి ఎదగడానికి ఎన్నో కష్ట నష్టాలను భరించారు. తన చిన్నతనంలో కుటుంబ పరిస్థితులు దారుణంగా ఉండేవని హలామీ గుర్తు చేసుకున్నారు. చిన్న ఇంట్లో చాలా కష్టపడాల్సి వచ్చిందని ఆయన వివరించారు. తినడానికి తిండి లేక, చేయడానికి పని లేని దశలో కుటుంబం ఎలా జీవించిందన్న విషయమై తమ తల్లిదండ్రులు ఇప్పటికీ ఆశ్చర్యం వ్యక్తం చేస్తారని ఆయన చెప్పారు. తిన్నా జీర్ణించుకోలేని మహువా పూలు వండుకుని తిన్నామని ఆయన గుర్తు చేసుకున్నారు. చిర్చాడిలో 400 నుంచి 500 కుటుంబాలు నివసిస్తుండగా.. హలామీ తల్లిదండ్రులు గ్రామంలో ఇంటి సహాయకులుగా పనిచేశారు. హలామీ తండ్రి 7వ తరగతి వరకు చదువుకున్నారు. ఆయనకి చిన్న ఉద్యోగం వచ్చిన తర్వాత పరిస్థితులు కాస్త మెరుగుపడ్డాయని హలామీ గుర్తు చేసుకున్నారు. 100 కి.మీ.దూరంలో ఉన్న కసనూర్ తహసీల్లోని ఒక పాఠశాలలో తండ్రికి వంట ఉద్యోగం రాగా, అక్కడికి వెళ్లడంతో పరిస్థితిలో మార్పు వచ్చిందన్నారు. హలామీ 4వ తరగతి వరకు కసనూర్‌లో, తర్వాత యావత్మల్‌లోని ప్రభుత్వ స్కూల్లో 10వ తరగతి వరకు చదివారు. గడ్చిరోలిలో బీఎస్సీ డిగ్రీ పూర్తి చేశారు. తర్వాత నాగ్‌పూర్‌లో కెమిస్ట్రీలో పీజీ చేశారు. 2003లో లక్ష్మీనారాయణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా చేశారు. మహారాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షలో ఉత్తీర్ణులైనప్పటికీ భాస్కర్‌కు పరిశోధనపై ఆసక్తి తగ్గలేదు. పీహెచ్‌డీ కోసం అమెరికా వెళ్లి డీఎన్‌ఏ, ఆర్‌ఎన్‌ఏలో పరిశోధనలు చేశారు. మిషిగన్ టెక్నాలాజికల్ యూనివర్సిటీ నుంచి పీహెచ్‌డీ పూర్తి చేశారు. ప్రస్తుతం సిర్నామోమిక్‌లో పనిచేస్తున్న తనకు ప్రస్తుతం తమ సంస్థల్లో చేరమని కోరుతూ వారానికి ఓ అరడజను వరకు కంపెనీల నుంచి ఇ-మెయిల్స్ వస్తుంటాయని స్వయంగా ఆయనే చెప్పారు.

జామకు 'పండు ఈగ'

విశాలాంధ్ర-చాగలమర్రి(నంద్యాల జిల్లా): జామ తోటలను పండు ఈగ తినేస్తోంది. ఎన్ని మందులు పిచికారి చేసినా ఫలితం కనిపించక పోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈగ వల్ల జామ దిగుబడి తగ్గి నష్టపోయే పరిస్థితి నెలకొంది. దెబ్బ తిన్న జామ కాయలను పొలాల గట్ల వెంట పడేస్తున్నారు. ఇప్పటికే చేసిన అప్పులకు తోడు తెగుళ్ల నివారణకు మందులు పిచికారి చేయడానికి ఇంకెంత అప్పుచేయాలని, ఇవి తీర్చేందుకే ఏడాదంతా సరిపోతోందని రైతులు చెబుతున్నారు. మండలంలోని ముత్యాలపాడు, చక్రవర్తులపల్లె, గొడిగనూరు, శెట్టివీడు, చాగలమర్రి తదితర గ్రామాల్లో 400 ఎకరాల్లో తైవాన్ జామ సాగు చేశారు. రూ.లక్షలు పెట్టుబడి పెట్టి లాభం వస్తుందని ఆశిస్తే పండు ఈగ వల్ల తీవ్రంగా నష్టపోతున్నామని రైతులు వాపోతున్నారు. తెగుళ్ల వల్ల ఆకులు ఎండిపోయి జామకాయకు పురుగులు పడి దెబ్బతింటున్నాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. ముత్యాలపాడులోనే 150ఎకరాలకు పైగా జామ తోటలను సాగు చేశారు. ఇప్పటి వరకు ఎకరాకు రూ.70వేల వరకు పెట్టుబడి పెట్టారు. కాయకోతల సమయానికి పండు ఈగ సోకి దెబ్బతిని కుళ్లిపోతున్నాయని రైతులు వాపోతున్నారు. గతేడాది కూడా పంట నష్టపోయామని, పరిహారం అందలేదని రైతులు ఆరోపిస్తున్నారు. ఉద్యానశాఖ అధికారులు ఈగ నివారణకు సలహాలు, సూచనలు ఇవ్వాలని, రాయితీలు అందించాలని రైతులు కోరుతున్నారు.

తెగుళ్లతో నష్టపోతున్నాం

తైవాన్ జామకు తెగుళ్లు సోకి దెబ్బతింటోంది. 150 ఎకరాల్లో జామ తోట సాగు చేశా. రూ.లక్ష పెట్టుబడి పెట్టా. అది వచ్చే పరిస్థితి కానరావడం లేదు. ప్రభుత్వం స్పందించి పరిహారం అందించి ఆదుకోవాలి.

-మాబు, రైతు, చాగలమర్రి

రూ.4 లక్షలు ఖర్చు పెట్టా

మూడెకరాల్లో తైవాన్ జామ సాగు చేశా. తోట కోసం రూ.4 లక్షలు ఖర్చు చేశా. ఏడాది నుంచి పైసా కూడా రాలేదు. జామకాయలను పండు ఈగ తినేస్తోంది. రంధ్రాలు పడి కుళ్లిపోతున్నాయి. దెబ్బతిన్న జామ కాయలను ఏరివేయడానికి రూ.60 వేలు దాకా ఖర్చు చేశా. రూ.10 వేల విలువ చేసే మందులు వాడినా, పండు ఈగ ఉధృతి తగ్గలేదు. పరిహారం అందించి ప్రభుత్వమే ఆదుకోవాలి.

-జమాల్ బాషా, రైతు, చాగలమర్రి

వలసల బండి కదిలింది

విశాలాంధ్ర-ఆస్పరి: మండల కేంద్రంలోని దళిత కాలనీ నుంచి తెలంగాణకు ఆదివారం వలసల బండి కదిలింది. ఎస్సీ కాలనీలోని రైతు, వ్యవసాయ కూలీలు నాలుగు రోజులుగా 10 వాహనాల్లో, దాదాపు 150 కుటుంబాలకు పైగా సంగారెడ్డి, వికారాబాద్, నిజామాబాద్, జోగిపేట, కామారెడ్డి జిల్లాలకు వెళ్లారు. గ్రామాల్లో ఉపాధి, వ్యవసాయ పనులు అంతంతమాత్రంగా ఉండడంతో కూలీలు పొట్టకూటి కోసం పెద్ద ఎత్తున కుటుంబాలు, పిల్లలతో కలిసి వలస బాట పట్టారు.

మండలంలో ఖరీఫ్ సీజన్లో అధిక వర్షాలు, తుపానుల వల్ల పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. వేసిన పంటలను పొలాల్లోనే వదిలేసి బతుకుదెరువు కోసం సుదూర ప్రాంతాలకు వారంతా పయనమయ్యారు.

గ్రామాల్లో ఉపాధి, వ్యవసాయ పనులు అంతంత మాత్రంగా ఉండడంతో కూలీలు పొట్టకూటి కోసం కుటుంబాలు, పిల్లలతో కలిసి వలస బాట పడుతున్నారు. తెలంగాణలో పత్తి తీయడం పనులు మొదలయ్యాయని, అందుకే వెళ్తున్నామని వారు చెబుతున్నారు. ఏటా జిల్లా పశ్చిమ ప్రాంతం ఆస్పరి మండలంలో వలసలు తప్పడం లేదు.

పనుల్లేకే వెళ్తున్నాం

గ్రామంలో పనులు లేవు. ప్రభుత్వం ఉపాధి పనులు సక్రమంగా చూపడం లేదు. మా కుటుంబాలు ఆర్థికంగా చితికిపోయాయి. తప్పని పరిస్థితుల్లో తెలంగాణ జిల్లాలలో పత్తి పంటను తీసేందుకు వెళుతున్నాం.

-పూజారి మారెప్ప, ఆస్పరి.

కుటుంబాన్ని పోషించాలంటే...వెళ్లాల్సిందే

ఈ సంవత్సరం ఖరీఫ్ సీజన్‌లో నాకున్న రెండున్నర ఎకరాల్లో పత్తి సాగు చేశా. నకిలీ పత్తి విత్తనాలతో ఆర్థికంగా నష్టపోయా. జీవనోపాధి కోసం నిన్నటి వరకు రైతుగా ఉన్న నేను, నేడు కూలీగా మారిపోయా.

-కోతి జైపాల్, ఆస్పరి

వలసలు నివారించాలి

అనేక సంవత్సరాల నుంచి ఆస్పరి మండలం నుంచి ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్లే వారి సంఖ్య ఎక్కువగానే ఉంది. నేడు ఆ సంఖ్య మరింత పెరిగింది. ప్రభుత్వం వెంటనే స్పందించి ప్రతి గ్రామంలో ఉపాధి పనులు కల్పించి వలసలు నివారించాలి.

- బ్రహ్మయ్య, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు

బీజేపీకి తిరుగుబాటు బెడద

(మొదటిపేజీ తరువాయి)

చేయాలని ఆయన భావిస్తున్నారు. ఇందుకోసం మద్దతుదారులు, అభిమానుల ఆమోదం కోసం వేచివున్నారు. పద్మ మాజీ ఎమ్మెల్యే దినేశ్ పటేల్ అలియాస్ దీను మామా స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్నట్లు ప్రకటించారు. పద్మ స్థానం నుంచి చైతన్యసిన్హా జాలాకు బీజేపీ టికెట్ ఇచ్చింది. ప్రస్తుతం ఈ స్థానం కాంగ్రెస్ ఆధీనంలో ఉంది. కర్జన్ మాజీ ఎమ్మెల్యే సతీశ్ పటేల్ కూడా పార్టీపై అసంతృప్తితో ఉన్నారు. తనను కాదని మరోసారి సిట్టింగ్ ఎమ్మెల్యే అక్షయ్ పటేల్‌కు టికెట్ ఇవ్వడం ఆయనకు కోపం తెప్పించింది. అక్షయ్ పటేల్ 2017లో కాంగ్రెస్ టికెట్‌పై గెలిచి 2020లో బీజేపీలో చేరారు. అనంతరం జరిగిన ఉప ఎన్నికలో గెలిచారు. కర్జన్‌లో విలేకరులతో సతీశ్ పటేల్ మాట్లాడారు. 'ఎమ్మెల్యేగా నియోజకవర్గానికి అక్షయ్ పటేల్ ఏమి చేశారో అందరికి తెలుసు. నా మద్దతుదారులు, సహచరులు ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగానైనా సరే పోటీ చేయమని కోరారు. అక్షయ్ పటేల్‌కు టికెట్ ఇచ్చేందుకు ముందు పార్టీ నన్ను సంప్రదించలేదు. బీజేపీ ఆఫీసు బేరర్లు-కార్యకర్తల్లో 80శాతం మందికి నా పేరునే అభ్యర్థిగా సిఫార్సు చేశారు. అయినా టికెట్ లభించలేదు. అక్షయ్ పటేల్ స్థానంలో వేరొకరిని నిలబెట్టి ఉంటే అంగీకరించేవాళ్లంగానీ ఆయనను ఇక్కడి ప్రజలు అంగీకరించరు' అని అన్నారు. అలాగే, జునాగఢ్‌లోని కేషోడ్ స్థానం మాజీ ఎమ్మెల్యే అరవింద్ లడానీ కూడా స్వతంత్రంగా పోటీ చేయనున్నట్లు ప్రకటించారు. ప్రస్తుత ఎమ్మెల్యే దేవభాయి మాలంకు టికెట్ ఇవ్వడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. 'బీజేపీ నాకు టికెట్ ఇవ్వకపోవడం కేషోడ్ ప్రజలకు కోపం తెప్పించింది. నా పని వారికి తెలుసు కాబట్టి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయాలని ప్రజలు, మద్దతుదారులు కోరారు. సోమవారం నామినేషన్ దాఖలు చేస్తాను' అని తెలిపారు. లడానీ 2012 నుంచి 2017 వరకు ఎమ్మెల్యేగా ఉన్నారు. అసంతృప్తి నేతల ప్రకటనల నేపథ్యంలో నష్టనివారణ చర్యలలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భార్గవ్ భట్, మంత్రి హర్ష సింఘ్వీ ఉన్నారు. శనివారం వడోదరలో పర్యటించి పార్టీ కార్యకర్తలను కలిశారు. వడోదరలోని అన్ని స్థానాల్లో బీజేపీ గెలుస్తుందన్న ధీమా వ్యక్తంచేశారు. దీనూ మామాను బుజ్జగిస్తామని, స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయొద్దు అని నచ్చ చెబుతామని, ఆయన ఎప్పుడూ బీజేపీ పక్షానే నిలిచారని, ఇప్పుడూ కాదనరన్న నమ్మకం ఉందని భట్, సింఘ్వీ అన్నారు. దీనూ మామా ఇంకా స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేయలేదు కాబట్టి మాకింకా అవకాశం ఉందని భట్ తెలిపారు. బీజేపీ ఒక కుటుంబం అని, తామంతా కలిసిమెలిసి ఉంటామని చెప్పారు. ప్రజా మద్దతుతో గెలుస్తామన్నారు. బీజేపీ ఇప్పటివరకు 166 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. రాష్ట్రంలోని మొత్తం 182 అసెంబ్లీ సీట్లకు డిసెంబరు 1, 5 తేదీల్లో రెండు దశల్లో ఎన్నికలు జరగనున్నాయి. ఓట్ల లెక్కింపు డిసెంబరు 8వ తేదీన జరగనుంది.

తెలుగు రాష్ట్రాలకు మోదీ ఏం చేశారు?

(మొదటిపేజీ తరువాయి)

వచ్చారన్నారు. సింగరేణి సంస్థలో 49 శాతం వాటా ఉన్న కేంద్రం దీనిని ప్రైవేటు పరం చేయలేదని, అందుకే ఈ సంస్థను బతికి ఉండగానే చంపే ప్రయత్నం చేస్తున్నదన్నారు. 2015లో గోదావరి పరివాహక ప్రాంతంలోని బొగ్గుబావిని సింగరేణికి ఇవ్వాలనే మైన్స్ మినరల్స్ డెవలప్ రెగ్యులేషన్ చట్టాన్ని 2015లో సవరించి, కమర్షియల్ మైనింగ్‌కు అనుమతినిచ్చారని, తద్వారా ఇప్పటికే 240 మైన్లు ప్రైవేటుకు ఇవ్వాలని గుర్తించారని, ఇందులో 98 మైన్లను ప్రైవేటు వ్యక్తులకు కేటాయించారని, వాటిలో కొన్ని బీజేపీ నేత కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి ఇచ్చారని నారాయణ తెలిపారు. ఇల్లందులోని కైరాగూడ ఒసి3మైన్, సత్తుపల్లిలోని ఒసి 3మైన్, మందమర్రిలో శ్రావణ పల్లి, కల్యాణఖనిలను ప్రైవేటుపరం చేసేందుకు నోటిఫికేషన్ ఇచ్చినట్టు వివరించారు. సింగరేణి పరిధిలోని బొగ్గు బావులను ప్రైవేటుకు అప్పగించిన తర్వాత సింగరేణి ఉత్పత్తి తగ్గిపోతుందని, తద్వారా బతికి ఉండగానే సింగరేణిని చంపేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. కేసీఆర్ రాజకీయ ఎత్తుగడలో తెలివైనవారని, అందుకే మునుగోడులో కమ్యూనిస్టులతో పొత్తు పెట్టుకున్నారన్నారు.

తాము సిద్ధాంత, విధానాలతోనే టీఆర్‌ఎస్‌కు మద్దతు ఇచ్చామని వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయంలో చిల్లర కొట్టుగా అవినీతి జరిగితే, బీజేపీ అధికారంలోనికి వచ్చిన తర్వాత హోల్ సింగిల్ విండో కుంభకోణం జరిగిందని నారాయణ విమర్శించారు. ప్రధాని మోదీ అవినీతిపరుల పని పడుతామని చెబుతున్నారని, అలా చేస్తే తమ మద్దతు ఉంటుందన్నారు. రూ.7500 కోట్ల అప్పును ఇవ్వడానికి బ్యాంక్ నిరాకరించిన అదానీ, మోదీ ప్రధాని అయిన తరువాత ఆర్థికంగా ప్రపంచంలోనే రెండవ వ్యక్తిగా ఎలా మారారని ప్రశ్నించారు. అసలైన కుంభకోణాలు, అవినీతిపరులు మోదీ వద్దనే ఉన్నారన్నారు. ముందుగా అదాని వెంట పడాలని, ఏమీ లేకుండా దేశాన్ని దోచుకోకుండానే ఇంత మొత్తంలో ఆయన ఎలా సంపాదించారని నారాయణ ప్రశ్నించారు.

నిరసన సెగ

(మొదటిపేజీ తరువాయి)

వారు నా గొంతకను అణచివేయవచ్చు అనుకున్నారు. మానవహక్కులు లేకుండా పర్యావరణానికి న్యాయం సాధ్యం కాదు' అని ఆమె ఉద్ఘాటించారు. వాతావరణ సంక్షోభంలో చాలా తక్కువ పాత్ర పోషించిన దేశాలతో వారి జీవితాలు, జీవనోపాధులు, ఇళ్లు, సంస్కృతులతో మూల్యం చెల్లించేలా సంక్షోభానికి అసలు కారకులైన దేశాలు చేశాయని వాతావరణ కార్యచరణ నెట్వర్క్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తస్నీమ్ ఎస్సోప్ ఆరోపించారు.

ఇదిలావుంటే, సీఓపీ27 మార్చ్‌కు మద్దతుగా లండన్, ఎడిన్‌బర్గ్, పారిస్, లిస్బన్, పోర్చుగల్‌లోనూ భారీ నిరసన ప్రదర్శనలు జరిగాయి. వందలాది మంది వీధుల్లోకి వచ్చి గళాన్ని వినిపించారు. అయితే సీఓపీ 27 సదస్సులో నిరసనలు దాదాపు మూగబోయాయి. ప్రదర్శనకారులు పరిమితంగా ఉండటానికి నగరంలో ఆంక్షలకు తోడు ప్రయాణం-వసతి వ్యయం అధికంగా ఉండటమే కారణమని కార్యకర్తలు ఆరోపించారు.

ప్రతినిధులకు భద్రతకు హామీ ఏది?

పర్యావరణ కార్యకర్తల నిరసనల క్రమంలో సదస్సుకు హాజరైన అగ్రనేతలు, ప్రతినిధులకు భద్రతపై జర్మన్ ప్రభుత్వం తీవ్రస్థాయిలో ఆందోళన వ్యక్తంచేసింది. ఐరాస వాతావరణ సదస్సుకు హాజరైన వారంతా సురక్షిత వాతావరణంలో పని చేసుకుంటూ చర్యలు జరపాలని భావిస్తున్నాం' అని జర్మన్ విదేశాంగ శాఖ ప్రకటన పేర్కొంది. 'ఇది జర్మన్లకే కాదు అందరు ప్రతినిధులకు, పౌర సమాజం, మీడియా ప్రతినిధులకూ సంబంధించినది. దీనిపై ఈజిప్టు అధికారులతో సంప్రదింపులు జరుపుతున్నాం' అని వెల్లడించింది. కాగా దీనిపై ఈజిప్టు అధికారులు ఇంకా స్పందించాల్సి ఉంది.

పెరిగిన డ్రాపౌట్లు

(మొదటిపేజీ తరువాయి)

పెరిగారు. న్యూఢిల్లీకి చెందిన విధి సెంటర్ ఫర్ లీగల్ పాలసీ ఇటీవల వెలువరించిన నివేదికలో ఈ వివరాలు వెల్లడయ్యాయి. ఏకీకృత జిల్లా విద్యా సమాచార వ్యవస్థ (యూడీఐఎస్‌ఈ), వార్షిక విద్యా నివేదిక (ఏఎస్‌ఈపీ) డేటాతో పాటు 21 ప్రాథమిక అధ్యయనాలను పరిగణనలోకి తీసుకొని 'భారత్‌లో కోవిడ్-19 కాలంలో (2020 ఏప్రిల్-2022 మే) స్కూలుకు వెళ్లని పిల్లలపై అధ్యయనం' పేరుతో ఈ నివేదిక వెలువడింది. (పాఠశాలలను మూసివేసినప్పటి నుంచి సర్వే జరిగినంత వరకు) ఆన్‌లైన్ విద్యకు నోచుకోని పిల్లలు 10శాతం నుంచి 60శాతం వరకు ఉన్నట్లు అధ్యయనాలు చెబుతున్నాయి. మహమ్మారి కాలంలో స్మార్ట్‌ఫోన్ల వినియోగం పెరిగింది. డిజిటల్ మాధ్యమాలు అందుబాటులో లేక స్కూలుకు వెళ్లే పరిస్థితి లేక 43శాతం మంది పిల్లలు 19 నెలల పాటు చదువుకు దూరమయ్యారని విధి సెంటర్ వెబ్‌సైట్ పేర్కొంది. మహమ్మారికి ముందు బడిబాట పట్టని పిల్లలు 2.5శాతంగా ఉంటే కోవిడ్ కాలంలో అది 43.5శాతానికి పెరిగిందని వెల్లడించింది. చిన్న పిల్లల్లోనూ డ్రాపౌట్లు పెరిగాయని, వలసలే ఇందుకు కారణమని పేర్కొంది. అన్ని అంశాల దృష్ట్యా సానుకూలమైన పాఠశాల విద్యా వ్యవస్థ తక్షణావశ్యమని నొక్కిచెప్పింది. అధికారులు వెంటనే స్పందించి పిల్లల సమస్యలను పరిష్కరించడంపై దృష్టిపెట్టాలని సూచించింది. పిల్లలు బడిబాట పట్టడమే కాకుండా వారు రోజువారీ ఎదుర్కొనే సమస్యలను పరిష్కరించడం కూడా ముఖ్యం. మెరుగైన మౌలిక వసతులు, సౌకర్యాలు పాఠశాలల్లో ఉండాలి' అని నివేదిక పేర్కొంది.

విభజన హామీల సాధనకు మరో ఉద్యమం

(మొదటిపేజీ తరువాయి)

వ్యతిరేకిస్తూ పెద్దఎత్తున ఉద్యమిస్తుంటే కనీసం దానిపై మోదీ మాట్లాడలేదన్నారు. విశాఖలో ప్రారంభించిన ప్రాజెక్టులు అన్నీ అదానీ పరమవుతున్నాయని అన్నారు. విజయవాడ, విశాఖల్లో మెట్రో ప్రాజెక్టుకు ఒక్క రూపాయి ఇవ్వలేదన్నారు. ఏ ప్రాజెక్టు ప్రారంభించినా గుజరాత్‌కు ,అదాని, అంబానిలకు ప్రయోజనం చేయటానికి మాత్రమే అని విమర్శించారు. గతంలో బీజేపీని తీవ్రంగా విమర్శించిన పవన్, మోదీతో సమావేశం అనంతరం ఎందుకు సైలెంట్ అయ్యారన్నారు. వామపక్ష నాయకులను అరెస్టు చేస్తే కనీసం ప్రశ్నించలేదన్నారు. రాహుల్ గాంధీ ప్రత్యేక హోదాపై స్పష్టమైన హామీ ఇచ్చారన్నారు. కాంగ్రెస్ నగర అధ్యక్షుడు నరహరిశెట్టి నరసింహారావు మాట్లాడుతూ, జగన్ రాష్ట్ర ప్రయోజనాలు కంటే స్వప్రయోజనాలు కోసమే ప్రయత్నించారన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే మొదటి సంతకం ప్రత్యేక హోదాపైనే చేస్తామని రాహుల్ గాంధీ హామీ ఇచ్చారన్నారు. ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు ఫణిరాజ్ మాట్లాడుతూ, ప్రత్యేక హోదా వస్తేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. 26న ఢిల్లీలో జరిగే ఆందోళనకు మద్దతుగా విజయవాడలో పెద్దఎత్తున ఆందోళన చేస్తామన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దోనేపూడి శంకర్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్సన్‌బాబు, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కె.ప్రసన్నకుమార్, డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న, తాటికొండ నరసింహారావు పాల్గొన్నారు.

కొత్త బస్సులేవి?

- ఆర్టీసీలో 50 శాతం కాలం చెల్లినవే!
- తక్షణం 25శాతం వరకు మార్చాల్సి ఉన్నా నిర్లక్ష్యం
- ప్రమాదాలకు ఉద్యోగులదే బాధ్యత: యాజమాన్యం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఏపీఎస్ఆర్టీసీ కాలం చెల్లిన బస్సులను నడుపుతూ ప్రయాణీకుల భద్రతను విస్మరిస్తోంది. పైపెచ్చు ప్రమాదాలు జరిగితే డిపో మేనేజర్లు/గ్యారేజీ సూపర్ వైజర్లనే బాధ్యులుగా చేస్తూ ఉత్తర్వులు జారీచేయడం ఆర్టీసీ యాజమాన్యం, ప్రభుత్వ బాధ్యతారాహిత్యానికి నిదర్శనంగా కనిపిస్తోంది. ఏపీఎస్ఆర్టీసీ ప్రస్తుతం నడుపుతున్న బస్సుల్లో 50శాతం వరకూ కాలం చెల్లినవేనని సమాచారం. వాటి స్థానంలో కొత్త బస్సులను తీసుకురాకుండా పాత వాటితోనే నెట్టుకురావడంపై సర్వత్రా విమర్శలున్నాయి. ఆర్టీసీ సంస్థ నుంచి ప్రతినెలా రూ.125కోట్ల ఆదాయాన్ని తీసుకుంటున్న ప్రభుత్వం... నూతన బస్సుల కొనుగోలుపై దృష్టి పెట్టకపోవడం ఆక్షేపణీయంగా మారింది. ఇటీవల కాలంలో ఆర్టీసీ బస్సులు బ్రేక్ ఫెయిల్ అవడం, అదుపు తప్పడం, ప్రమాదాలకు గురైన ఘటనలపై మీడియాలో విస్తృతంగా వార్తలొచ్చాయి. ఇవన్నీ సీఎంవో కార్యాలయ దృష్టికి వెళ్లాయి. దీంతో ప్రమాదాలు జరిగితే డిపో మేనేజర్లు, గ్యారేజీ సూపర్‌వైజర్లే బాధ్యత వహించాలంటూ ఆర్టీసీ యాజమాన్యం హడావుడిగా ఉత్తర్వులు జారీజేయడంపై ఉద్యోగుల్లో తీవ్ర వ్యతిరేకత నెలకొంది. కాలం చెల్లిన బస్సుల స్థానంలో కొత్త బస్సులను ప్రభుత్వం కొనుగోలు చేయకుండా ఆర్టీసీ యాజమాన్యం, ప్రభుత్వం కాలయాపన చేస్తూ... పరోక్షంగా ప్రమాదాలకు కారణమవుతున్నాయి. ఆర్టీసీ దాదాపు 11,500 బస్సులు నడుపుతుండగా ఇందులో 8,500 బస్సులు ఆర్టీసీవి కాగా, మరో 3వేల బస్సులు అద్దెవి ఉన్నాయి. 12లక్షల కిలోమీటర్లకుపైగా నడిచి ఉనికిని కోల్పోతున్న బస్సులు 50శాతం వరకు ఉన్నాయి. 15లక్షల కిలో మీటర్ల నుంచి 16లక్షల కిలోమీటర్లకుపైగా తిరిగిన బస్సులు 10 నుంచి 20శాతం వరకు ఉన్నట్లు సమాచారం. రవాణాశాఖ నిబంధనల ప్రకారం 12లక్షల కిలోమీటర్లపాటు దూర ప్రాంతాలకు నడిచిన బస్సులను తక్షణమే నిలుపుదల చేయాల్సి ఉంది. ఇప్పుడున్న పళంగా 25శాతం బస్సులను మార్చాల్సిన అవసరం ఉన్నప్పటికీ, దానిపై ఆర్టీసీ యాజమాన్యం, ప్రభుత్వం దృష్టి పెట్టడం లేదు. దూర ప్రాంతాలకు 7లక్షలకుపైగా కిలోమీటర్లు నడిచిన బస్సులను వెంటనే పల్లె వెలుగు బస్సులుగా మార్పు చేసి, స్థానికంగా తిప్పాలి. కానీ అలాంటి చర్యల్ని మొక్కుబడిగానే చేస్తున్నారు. ఈ నిబంధనలేమీ ఆర్టీసీ యాజమాన్యం పాటించకుండా ప్రమాదాలు జరిగితే, సంబంధిత డిపో మేనేజర్లు, గ్యారేజీ సూపర్‌వైజర్లదే బాధ్యత అంటూ ఆదేశాలు ఇవ్వడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు.

విడి భాగాల కొరత

మరమ్మతులకు గురవుతున్న ఆర్టీసీ బస్సులకు అవసరమైన విడి భాగాలను అందించడంలోనూ యాజమాన్యం పూర్తిగా విఫలమవుతోంది. ఒక ఆర్టీసీ బస్సు మరమ్మతుల కోసం డిపోలోని షెడ్‌కు వస్తే... అక్కడి మెకానికల్ సిబ్బంది, సూపర్ వైజర్లు ఐదు విడిభాగాలను అడిగినా... అందులో కనీసం ఒకట్రెండు కూడా అందించలేక పోతున్నారు.

బస్సుల్లోఅవసరమైన భాగాలకు నూతన పరికరాలను బిగించకుండా, పైకి అందంగా కనిపించేలా రూ.70వేలకుపైగా వెచ్చించి తీర్చిదిద్దుతున్నారు. ఈ చర్యలతో బస్సులు ప్రమాదాల గురయ్యే ఆస్కారముంది. అక్కడికీ ఆర్టీసీలో అంకిత భావంతో డ్రైవర్లు విధులు నిర్వహిస్తున్నందునే చాలా వరకు ప్రమాదాలను నియంత్రిస్తున్నారు. ఇవేమీ పట్టని ఆర్టీసీ యాజమాన్యం...బస్సులు ప్రమాదాలకు గురైనా, బ్రేక్‌లు ఫెయిల్ అయినా సిబ్బందితే బాధ్యతంటూ హెచ్చరించేలా ఉత్తర్వులు ఇవ్వడంపై ఆర్టీసీ కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ప్రతినెలా రూ.125 కోట్ల ఆదాయం

ఆర్టీసీ సంస్థ ప్రభుత్వంలో విలీనమయ్యాక నూతన బస్సులపై దృష్టి పెట్టలేదు. ఉన్న బస్సులతోనే కాలం గడుపుతున్నారు. నాలుగు నెలలుగా ఆర్టీసీ నుంచి ప్రభుత్వం నెలకు రూ.125కోట్లు తీసుకుంటోంది. అయినా నూతన బస్సుల కొనుగోలుపై ప్రభుత్వం దృష్టి పెట్టడం లేదు. ప్రభుత్వం, ఆర్టీసీ యాజమాన్యం విధానాల వల్ల మధ్యలో ఉద్యోగులు, కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఆర్టీసీ బస్సుల నాణ్యతను చక్కదిద్దకుండా ప్రమాదాలు జరిగినప్పుడు కేవలం అధికారులు, సూపర్ వైజర్లు, సిబ్బందిపైనే నెపం వేయడాన్ని తప్పుబడుతున్నారు. ప్రతి డిపోకు 5 నుంచి 6 బస్సులను క్రమేపీ కుదిస్తున్నారు. ఈ కుదింపు వల్ల భవిష్యత్తులో దాదాపు 2వేల వరకు బస్సులు తగ్గిపోయే ప్రమాదముంది. ఇప్పటికైనా ప్రభుత్వం, ఆర్టీసీ యాజమాన్యం స్పందించి కాలం చెల్లిన బస్సుల స్థానంలో నూతన బస్సుల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాల్సిన అవసరముంది.

ఒక్క అవకాశం ఇస్తే.. రాష్ట్రాభివృద్ధి చేసి చూపిస్తా: పవన్ కల్యాణ్

విశాలాంధ్ర-విజయనగరం టౌన్: ఒక్క అవకాశం ఇస్తే రాష్ట్రాభివృద్ధి ఏ విధంగా ఉంటుందో చేసి చూపిస్తానని జనసేన పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పవన్ కల్యాణ్ అన్నారు. 'జగనన్న ఇల్లు-పేదల కన్నీళ్లు' కార్యక్రమంలో భాగంగా ఆది వారం విజయనగరం జిల్లా పరిధిలోని గుంకలంలో ఆయన పర్యటించారు. ముందుగా జిల్లాకు వచ్చిన ఆయనకు వై జంక్షన్ వద్ద జనసేన కార్యకర్తలు, నాయకులు స్వాగతం పలికారు. వై జంక్షన్, సంతకాల వంతెన, కలెక్టర్ ఆఫీస్ మీదుగా గుంకలం చేరుకున్న ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో జరుగుతున్న అవినీతిపై ప్రధాని నరేంద్ర మోదీకి రానున్న కాలంలో తెలియజేస్తామన్నారు. ఉత్తరాంధ్రలో జనసేనకి గతంలో కన్నా ఆదరణ పెరిగిందన్నారు. రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం జగనన్న కాలనీల పేరిట రూ.పదివేల నుంచి రూ.12 వేల కోట్లు దోపిడీ చేశారన్నారు. ఎవరైనా ప్రశ్నించిన వారిని గుండాలతో భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. కరోనా సమయంలో కూడా వీళ్ల దోపిడీ ఆగలేదనీ, జనసేన అధికారం లోకి వస్తే పేదవారికి ఇసుక ఉచితంగా ఇస్తామన్నారు. అవినీతిరహిత పాలన ఎలా ఉంటుందో చూపిస్తామన్నారు. ప్రజల డబ్బును వైసీపీ ప్రభుత్వం ఇష్టానుసారంగా ఖర్చు చేస్తోందన్నారు. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏం చేసిందో చెప్పాలన్నారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా ప్రజలంతా వైసీపీ నేతలను చూసి భయభ్రాంతు లకు గురయ్యే పరిస్థితి ఏర్పడిందన్నారు. విజయనగరం యువతన తనతో 14 కిలోమీటర్లు వెనుక రావడం ఆనందంగా ఉందన్నారు.

ఉత్తరాంధ్ర మనోభావాలను మోదీ దెబ్బతీశారు

విశాలాంధ్ర-కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ అధ్వర్యంలో స్టీల్ ప్లాంట్ ఆర్చి వద్ద చేపడుతున్న దీక్షలు 640వ రోజుకు చేరుకున్నాయి. రిలే నిరాహారదీక్ష శిబిరంలో విశాఖ ఉక్కు కర్మాగారం ఒప్పంద కార్మికులు పాల్గొన్నారు. వీరిని ఉద్దేశించి విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ప్రతినిధులు డీ ఆదినారాయణ, పీ శ్రీనివాసరాజు, ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు పడాల రమణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రధాని మోదీ పర్యటనను సద్వినియోగం చేసుకోవడంలో విఫలమైందని విమర్శించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి విజ్ఞప్తులతో సంబంధం లేకుండా ప్రధాని ప్రసంగం సాగించారని తద్వారా ఉత్తరాంధ్ర ప్రజల మనోభావాలను తీవ్రంగా దెబ్బతీశారన్నారు. తీవ్ర నిర్బంధాల నడుమ ప్రధాని పర్యటన జరిగిందని, ఈ నిర్బంధాలపై ప్రతిపక్షాలు పార్టీలు తమ నిరసనను పత్రికాముఖంగా కూడా ఖండించకపోవడం దుర్మార్గమన్నారు. ఇప్పటికైనా ప్రతిపక్ష పార్టీలకు కలుపుకుంటూ రాష్ట్ర ముఖ్యమంత్రి, ప్రధానిపై ఒత్తిడి చేయాలని డిమాండ్ చేశారు. ఈ దీక్షా శిబిరంలో ఒప్పంద కార్మిక ప్రతినిధులు జీ శ్రీనివాసరావు, ఓవీ రావు, కేఎం శ్రీనివాస్, ఒప్పంద కార్మికులు బీ ఆనంద్, సోమేశ్, పీ మసేన్, ఆర్ఎన్ ఆంజనేయులు తదితరులతోపాటు అధిక సంఖ్యలో ఒప్పంద కార్మికులు పాల్గొన్నారు.

ధన్‌బాద్ ఎక్స్‌ప్రెస్‌కు తృటిలో తప్పిన ప్రమాదం



విశాలాంధ్ర-సీతానగరం: డ్రైవర్ అప్రమత్తంగా వ్యవహరించడంతో ధన్‌బాద్ ఎక్స్‌ప్రెస్‌కు తృటిలో పెనుప్రమాదం తప్పింది. పార్వతీపురం మన్యం జిల్లా సీతానగరం రైల్వే స్టేషన్ పరిధిలోని చినభోగిల రైల్వేగేటు సమీపాన ఆదివారం ధన్‌బాద్ ఎక్స్‌ప్రెస్ (బొకారో)ను డ్రైవర్ పెనుప్రమాదం నుంచి కాపాడారు. అలెప్పి నుంచి ధన్‌బాద్ వెళ్లే ధన్‌బాద్ ఎక్స్‌ప్రెస్ రైలు బొబ్బిలి స్టేషన్ దాటి పార్వతీపురం వస్తుండగా సాయంత్రం 3.50 గంటల సమయంలో చినభోగిలి గ్రామం వద్ద డౌన్‌ట్రాక్‌పై పనులు జరుగుతున్నాయి. రైలు వస్తున్న సమయంలో డౌన్ ట్రాక్‌పై మూడవ లైన్ కోసం పట్టాలు తరలిస్తున్న ఐరన్ రోప్ ఒకటి పట్టాలు మధ్య ఇరుక్కుపోయింది. దాన్ని సకాలంలో సిబ్బంది తీయలేకపోయారు. అప్పటికే స్టేషన్ సిబ్బంది సిగ్నల్ ఇవ్వడంతో రైలు గేటు దాటి పనుల సమీపంలోకి వస్తుండడంతో కొంతమంది కూలీలు రైలు ఆపండంటూ గట్టిగా కేకలు వేశారు. రైలు నిలిపే అధికారం తనకు లేదని చినభోగిలి గేట్ మాన్ కూలీలకు చెబుతుండగానే రైలు డ్రైవర్ జనాలకేకలు విని రైలు నిలిపివేశారు. దీంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. రైలు సుమారు అర్ధగంటపాటు నిలిచిపోయింది. ట్రాక్ పై ఇరుక్కుపోయిన రోప్‌ను తొలగించారు. సుమారు 50 మందికిపైగా కూలీలు పనిచేస్తున్నా రైల్వే ఇంజినీరింగ్ అధికారులు తగుచర్యలు తీసుకోలేదని స్పష్టంగా తెలుస్తోంది. కనీసం ఎర్రజెం డాలు అక్కడ లేవని స్థానికులు చెబుతున్నారు. ట్రాక్‌పై పనులు జరుగుతుం డగా రైలుకు సిగ్నల్ ఎలా ఇచ్చారని ప్రయాణికులు, స్థానికులు ప్రశ్నించారు. డ్రైవర్ అప్రమత్తంగా వ్యవహరించకపోతే పెద్ద ప్రమాదం జరిగేదని గ్రామ స్తులు అంటున్నారు. తమకు ఎటువంటి సంబంధంలేదని, వివరాలు కావాల ంటే ఇంజినీరింగ్ అధికారులను అడగండని సీతానగరం స్టేషన్ సిబ్బంది, చినభోగిలి గేట్‌మాన్ తెలిపారు. ఈ ఘటనపై విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు. డ్రైవరును అభినందించారు.

దిల్లీ లిక్కర్ స్కామ్ వెనుక జగన్, విజయసాయిరెడ్డి

టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బొండా

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: దిల్లీ లిక్కర్ స్కామ్ వెనుక సీఎం జగన్, ఎంపీ విజయసాయిరెడ్డి ఉన్నారని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బొండా ఉమామహేశ్వరరావు విమర్శించారు. మంగళగిరి టీడీపీ జాతీయ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, అరబిందో ఫార్మా కుటుంబీకులకు లిక్కర్ వ్యాపారాలు ఎక్కడా లేవని, పెనాక శరత్ చంద్రారెడ్డిని బినామీగా పెట్టుకుని విజయసాయిరెడ్డి బలిపశువును చేశారని ఆరోపించారు. రాష్ట్రంలో అదాన్ డిస్టిలరీస్ పేరుతో కల్తీ లిక్కర్ వ్యాపారం జరుగుతోందనీ, నెలకు రూ.300 కోట్ల మద్యం వ్యాపారం జరుగుతోందని పేర్కొన్నారు. 2019లో తెచ్చిన కొత్త మద్యం పాలసీ తర్వాత రూ.4 లక్షల కోట్ల మద్యం వ్యాపారం జరిగిందని, ఈ డబ్బు మొత్తం ఎక్కడికి పోయిందో జగన్, విజయసాయిరెడ్డి నోరు విప్పాలన్నారు.

భార్యను హత్య చేసి... భర్త ఆత్మహత్య

జగన్నాథపురంలో దారుణం

విశాలాంధ్ర-సంతబొమ్మాళి: భార్యను హత్య చేసి భర్త ఆత్మహత్య చేసుకున్న హృదయవిదారక సంఘటన ఇది. శ్రీకాకుళం జిల్లా సంతబొమ్మాళి మండలంలో నౌపడ పంచాయతీ పరిధిలోని జగన్నాథపురం గ్రామానికి చెందిన దాసరి సింహాద్రి, ఉమాకు 30 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ధర్మారావు ఉన్నారు. కుమార్తెలకు వివాహమై అత్తారింటికి వెళ్లిపోగా, కుమారుడు తెలంగాణ రాష్ట్రం ఖమ్మంలో జేసీబీ ఆపరేటర్‌గా పని చేస్తున్నాడు. సింహాద్రి (60), ఉమా (50) స్వగ్రామంలో కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. భర్త మద్యానికి బానిసై భార్యతో నిత్యం గొడవలు పడుతూ ఉండేవాడు. ఈ క్రమంలో శనివారం రాత్రి మద్యం తాగి వచ్చి భార్యతో గొడవపడ్డాడు. భార్య నిద్రలోకి జారుకున్న సమయంలో మద్యం మత్తులో ఉన్న సింహాద్రి కత్తితో ఆమె గొంతుకోసి హత్య చేశాడు. భయంతో తాను కూడా దూలానికి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆదివారం ఉదయం 6 గంటల సమయంలోకుళాయిలో నీరు పట్టుకునేందుకు ఉమా బయటకు రాకపోవడంతో వీధిలో మహిళలు పిలిచేందుకు వెళ్లారు. ఇద్దరూ మృతిచెందడం చూసి భయాందోళన చెందారు. సర్పంచ్ భర్త పి.రవికుమార్‌రెడ్డి పోలీస్‌స్టేషన్‌కు సమాచార మందజేశారు. టెక్కలి సీఐ చంద్రమౌళి, నౌపడ ఎస్సై మహమ్మద్ అలీ, తహసీల్దార్ చలమయ్య, ఘటన స్థలానికి చేరుకొని ఆరా తీశారు. క్లూస్ టీం వేలిముద్రలను సేకరించారు. కత్తిని, పరిసరాలను పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతులను టెక్కలి జిల్లా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చంద్రమౌళి తెలిపారు.

అతిథి పాత్రధారి జనసేనాని: జోగి

'జగనన్న ఇళ్లు-పవన్ బాబుల కన్నీళ్లు'గా ట్యాగ్‌లైన్ మార్చుకోవాలని హితవు



విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: 'పవన్ కళ్యాణ్ నీ ట్యాగ్‌లైన్ కాస్త మార్చుకో... జగనన్న ఇళ్లు-పవన్ బాబుల కన్నీళ్లు' అని ట్యాగ్‌లైన్ పెట్టుకోవాలని రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి జోగి రమేష్ హితవు పలికారు. తాడేపల్లి వైసీపీ కేంద్ర కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, వారాంతపు అతిథి పాత్రధారి పవన్ అని ఎద్దేవా చేశారు. విజయనగరం జిల్లా గుంకలాంలో జగనన్న కాలనీ లేఅవుట్‌కు వెళ్లిన జనసేనాని లబ్ధిదారులంతా వచ్చి ప్రభుత్వంపై నిందలు వేసి, తనకు బాసటగా నిలుస్తారని ఆశించగా... తమకు ఇళ్లు కట్టిస్తున్నారని, బిల్లులు కూడా ఇస్తున్నారని అంతా చెప్పడంతో ఆయన గుండె జారి పోయిందన్నారు. గుంకలాంలో 10 వేల ఇళ్ల నిర్మాణం జరుగుతుంటే, ఏ పనులూ జరగడం లేదంటావా? నీకసలు కళ్లున్నాయా? అని ప్రశ్నించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా 31 లక్షల అక్కచెల్లెమ్మలకు ఇళ్ల పట్టాలు ఇచ్చిన ఏకైక సీఎం జగన్ అని కొనియాడారు. రెండు దశల్లో 21 లక్షల ఇళ్లు నిర్మిస్తున్నామని, ఆ పనులు శరవేగంగా జరుగుతున్నాయని స్పష్టం చేశారు. 2014 నుంచి 2019 వరకు టీడీపీ, జనసేన, బీజేపీ కలిసి ప్రభుత్వంలో ఉన్నాయనీ, ఆనాడు అర్హులైన పేదలందరికీ మూడు సెంట్లలో ఉచితంగా పక్కాఇళ్లు కట్టించి ఇస్తామన్నారనీ, కనీసం ఒక్క పేద కుటుంబానికి ఇంటి స్థలం ఇచ్చారా? అని నిలదీశారు. లోకేశ్ మోకాళ్లతో నడిచినా, దొర్లుకుంటూ నడిచినా, పంగనామాలు పెట్టి నడిచినా ఆయన తండ్రి చేసిన పాపాలు వదిలిపెట్టవని అన్నారు. 2024లోనూ అసెంబ్లీలోకి అడుగు పెట్టబోరన్నారు.

ఎన్‌హెచ్‌పీసీ సూచనలమేరకే

డయాఫ్రమ్‌వాల్ పనుల్లో ముందుకు: అంబటి

విశాలాంధ్ర బ్యూరో-ఏలూరు: పోలవరం ప్రాజెక్ట్ డయాఫ్రమ్‌వాల్‌ను నేషనల్ హైడ్రో పవర్ కార్పొరేషన్ (ఎన్‌హెచ్‌పీసీ) పరిశీలించిన అనంతరం, వారి సూచనల మేరకు పనుల్లో ముందుకు వెళతామని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు చెప్పారు. ఏలూరు జిల్లా పోలవరం ప్రాజెక్ట్‌కు సంబంధించి అప్పర్, లోయర్ కాఫర్ డామ్ పనులు, డయాఫ్రమ్ వాల్, గ్యాప్-1 పనులను ఆదివారం అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ప్రస్తుతం గోదావరి నదికి వరద తగ్గుముఖం పట్టిందని, 50 వేల క్యూసెక్కుల పైగా నీటిని దిగువకు విడుదల చేయడం జరిగిందన్నారు. ప్రాజెక్ట్ పనులు ముమ్మరంగా చేపట్టేందుకు ఆకాంక్షతో ఉన్నామని అన్నారు. ఇబ్బందల్లా డయాఫ్రమ్ వాల్ స్థితిగతులు తెలుసుకోవడమేనన్నారు. ఎన్‌హెచ్‌పీసీ డయాఫ్రమ్ వాల్‌ను పరిశీలించి నివేదిక ఇచ్చిన తరువాత వారి సూచనల మేరకే పనులు చేపట్టవలసి ఉంటుందని చెప్పారు. డయాఫ్రమ్ వాల్ పూర్తిగా నీటిలో మునిగి ఉన్నదని, మోటార్ల సాయంతో నీటిని బయటకు తోడుతున్నామన్నారు. ప్రస్తుతం లోయర్ కాఫర్ డామ్ పనులు ప్రారంభించామని వివరించారు. డయాఫ్రమ్ వాల్ కొత్తది నిర్మించాలా లేక పాతదానిపైనే ఎర్త్ కం రాక్ ఫిల్ డామ్‌ను నిర్మించాలా అన్నది నిర్ణయించడం జరుగుతుందన్నారు. గత ప్రభుత్వం కాఫర్ డామ్ నిర్మాణం పూర్తి స్థాయిలో చేయకుండా డయాఫ్రమ్ వాల్ నిర్మించి తప్పిదం చేసిన కారణంగానే ఇటువంటి పరిస్థితి ఏర్పడిందన్నారు. పోలవరం ప్రాజెక్ట్ లో ప్రధానమైనవి స్పిల్ వే, ఎర్త్ కం రాక్ ఫిల్ డామ్ నిర్మాణమని, వీటిలో స్పిల్ వే నిర్మాణం పూర్తి అయిందని అన్నారు. పోలవరం ప్రాజెక్ట్ అథారిటీ అనుమతితో ఎర్త్ కం రాక్ ఫిల్ డామ్ నిర్మాణాన్ని ఈ ఏడాదిలో చేపడతామని మంత్రి చెప్పారు. జలవనరులశాఖ పర్యవేక్షక ఇంజినీర్ నరసింహమూర్తి, ఈఈ సుధాకర్, మెగా సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఆశాల ఫేస్ అటెండెన్స్ ఉపసంహరించుకోవాలి

రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శాంతి, సుభాషిణి డిమాండ్



విశాలాంధ్ర-కడప రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ఆశాలకు ఫేస్ రిజిస్టర్ విధానాన్ని తక్షణ ఉపసంహరించుకోవాలని ఏపీ ఆశావర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పి. సుభాషిని, శాంతి డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ఏఐటీయూసీ జిల్లా కార్యాలయంలో ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా సమితి సమావేశం కె కల్పన అధ్యక్షతన జరిగింది. సుభాషిని, శాంతి మాటాడుతూ గత 18ఏళ్లుగా ఉద్యోగ భద్రత, కనీస వేతనం, క్యాజువల్ సెలవులు, ప్రసూతి సెలవులు లేకుండా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వెట్టి చాకిరి చేయించుకుంటున్నాయన్నారు. ఫేస్ అటెండెన్స్ ఉదయం తీసుకున్న తరువాత ప్రతి ఆశా ఫీల్డ్ వర్క్‌లో గ్రామాలలో విధులు నిర్వహించవలసి ఉన్నది. ప్రతి ఆశా వెయ్యి మంది జనాభాకు పని చేయవలసి ఉండగా ప్రభుత్వాలు 1000 నుండి 3000 జనాభాకు పని చేయించుకుంటున్నాయి. సెంటర్ నుంచి గ్రామాలకు కనీసం 2, 3కి.మీ. దూరం ఉన్న గ్రామాలలో విధులు నిర్వహించాల్సి ఉంది. చాలా గ్రామాలలో సెల్‌టవర్లు పనిచేయక సాయంత్రం 4 గంటలకు ఫేస్ అటెండెన్స్ నమోదు కాకపోతే ఆరోజు విధులకు గైర్హాజరు అయినట్టు నమోదుచేసే పరిస్థితి ఉందని వచ్చే వేతనంలో కోత విధించడానికి ఈ విధానాన్ని తీసుకొచ్చారని విమర్శించారు. గర్భవతులను, బాలింతలను గ్రామాల నుంచి సుదూర ప్రాంతాలైన జిల్లా ఆసుపత్రులకు తరలించాలని గర్భవతులు డెలివరీ అయ్యేంతవరకు ఉండవలసిన ఆశా కార్యకర్తలకు ఫేస్ అటెండెన్స్ తీసుకోవడం కష్టం అవుతుంది కాబట్టి తక్షిణంతః విధానం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం 10వేల నుంచి 15వేలకు వేతనం పెంచుతామని ఇచ్చిన హామీ మేరకు జీవో విడుదల చేయాలనీ, కార్యకర్తలకు 10 లక్షల ఉచిత బీమా పథకాన్ని అమలు చేయాలని, ఆశాల రికార్డులను రాష్ట్ర ప్రభుత్వమే సరఫరా చేయాలని, ఆశా కార్యకర్తలను వైద్య ఉద్యోగులుగా గుర్తించి పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గుంటి. వేణుగోపాల్, ఎల్ నాగ సుబ్బారెడ్డి, జిల్లా సమితి సభ్యులు పి.చంద్రశేఖర్, ఆశా యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కె కల్పన, ఎస్. అయ్యవారమ్మ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పీవీ రమణమ్మ, జిల్లా ఉపాధ్యక్షులు అమ్ములు, శోభారాణి, అనసూయ, వరలక్ష్మి, షాబాను పార్వతి, జమీనా పాల్గొన్నారు.

స్త్రీవాదం కాగితం పులి కాకూడదు

ఏఐఎస్ఎఫ్ సమ్మేళనంలో వక్తలు

విశాలాంధ్ర-విజయవాడ(కృష్ణలంక): మహిళా సాధికారత, స్త్రీ వాదం కాగితాలకే పరిమిత మవకూడదని వక్తలు ఉద్ఘాటించారు. అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) రాష్ట్ర సమితి అధ్వర్యంలో విద్యార్థినుల సమ్మేళనం ఆదివారం విజయవాడలోని హనుమాన్ పేట దాసరి భవన్‌లో జరిగింది. రాష్ట్ర రైతు సాధికారత సంస్థ ప్రాజెక్ట్ మేనేజర్ రావులపల్లి అరుణ ముఖ్య వక్తగా పాల్గొని ప్రసంగిస్తూ విద్యా రంగంలో శాస్త్రీయ దృష్టి లోపించిందన్నారు. ఆడపిల్లలు స్వయం శక్తితో పైకి ఎదగాలని, ఆధునికత పరిజ్ఞానం అందిపుచ్చుకుని సామాజిక, రాజకీయ, ఆర్థిక రంగాల్లో ముందుకు సాగాలన్నారు. వివక్షత, వేధింపుల కారణంగా ఆడవారు నేటికీ విద్యకు దూరంగా ఉన్నారన్నారు. విద్యార్థి సమాఖ్య పూర్వ జాతీయ కార్యదర్శి జీ ఈశ్వరయ్య మాట్లాడుతూ వ్యాపార వాణిజ్య ప్రకటనల్లో మహిళల్ని కించ పరిచే విధంగా అశ్లీలంగా చిత్రీకరణ చేయడం బాధాకరమని, సెన్సార్ బోర్డు అసలు ఉందా అని ప్రశ్నించారు. ఏపీ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెన్మెత్స దుర్గాభవాని మాట్లాడుతూ 'భేటీ బచావో-భేటీ పడావో', నిర్భయ, దిశ అనేవి కేవలం కాగితాలకే పరిమితమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. నేరాలు ఘోరాలు చేసి జైళ్లలో ఉండి జీవిత శిక్ష అనుభవిస్తున్న వారిని సైతం నేడు బీజేపీ ప్రభుత్వం విడుదల చేయడం సిగ్గుచేటన్నారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర విద్యార్థినుల కన్వీనర్ మోతుకూరి అభ్యుదయ ఇటీవల కమ్యూనిస్టు దేశమైన వియత్నాం పర్యటన అనుభవాలు వివరించారు. సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే శివారెడ్డి, అధ్యక్షుడు జాన్సన్‌బాబు మాట్లాడుతూ యువజన, విద్యార్థుల సమస్యలపై ఈనెల 25న చలో పార్లమెంట్, 26న జాతీయ విద్యార్థినుల సమ్మేళనం విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమానికి ఎమ్ అభ్యుదయ, సీహెచ్ ప్రీతి అధ్యక్షత వహించగా, రాష్ట్ర కమిటీ సభ్యులు ఎమ్.సాయికుమార్, ఓబులేసు, నాసర్‌జీ పాల్గొన్నారు. ప్రజా నాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెంచలయ్య విద్యార్థి ఉద్యమ గేయాలను ఆలపించి ఆకట్టుకున్నారు. ఈ సమ్మేళనానికి రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి విద్యార్థినులు హాజరయ్యారు.

పర్యాటకానికి రెక్కలు!

- పాపికొండల్లో విహారానికి పర్యాటకుల సన్నద్ధం
- బ్యాంబో హట్స్‌లో నైట్‌హాల్ట్ సౌలభ్యం
- అందుబాటులో టూరిజం ప్యాకేజీ
- భద్రాచలానికి పెరగనున్న భక్తుల తాకిడి
- ఊపందుకోనున్న వ్యాపారాలు
- సంక్రాంతి వరకు సందడిగా...

విశాలాంధ్ర-చింతూరు: అల్లూరి సీతారామరాజు జిల్లా వి.అర్.పురం నుంచి లాంచీ ప్రయాణానికి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో గోదావరి నదిలో సాగే లాంచీ ప్రయాణం మళ్లీ ప్రారంభం కానుంది. కొద్ది కాలంగా పాపికొండల లాంచీ విహారానికి విరామం వచ్చింది. కార్తీకమాసం పురస్కరించుకుని భక్తులు, పర్యాటకులు విహార యాత్రలు చేసే సమయం దగ్గరకు రావడం... లాంచీ ప్రయాణానికి అనుమతులు రావడంతో పర్యాటకరంగానికి రెక్కలు వచ్చినట్లయింది. దీంతో భద్రగిరికి వెళ్లే భక్తుల సందడి మరింత పెరగనుంది. చాలా కాలంగా ఇలాంటి ప్రయాణం లేక పర్యాటకులు తీర్థయాత్రలు కూడా వాయిదా వేసుకున్నారు. ప్రస్తుతం ప్రభుత్వం నుంచి అనుమతి రావడంతో లాంచీ ప్రయాణం ద్వారా భద్రాచలం పుణ్యక్షేత్రానికి భక్తుల తాకిడి భారీగా పెరిగే అవకాశం ఉంది. రాముడు నడయాడిన పుణ్యభూమిలో ఎన్నో పుణ్యక్షేత్రాలు భక్తులు దర్శించుకునేందుకు నెలవుగా ఉన్నాయి. భద్రాచలంతో పాటు పక్కనే ఉన్న ఎటపాక, కూనవరం రోడ్లో ఉన్న ఉష్ణ గుండాల, రాముడు, సీతమ్మ తిరిగిన ప్రాంతమైన దుమ్ము గూడెం మండలంలోని పర్ణశాల, పూర్వ ఖమ్మం జిల్లాలో వున్న వరరామచంద్రాపురం మండలం శ్రీరామగిరి, రామలక్ష్మణ చెట్టు. వాలిసుగ్రీవుల గుట్టలు పర్యాటక ప్రాంతాలుగా ప్రాచుర్యం పొందాయి. వీటన్నింటిని చూడదగ్గ ప్రాంతాలుగా పర్యాటక శాఖ గుర్తించింది. ఇందుకోసం తెలంగాణ పర్యాటక శాఖ టూరిజం ప్యాకేజీని కూడా అందుబాటులో ఉంచింది. టూరిజం శాఖ ఈ మేరకు ట్రయల్ రన్ కూడా నిర్వహించింది. బ్యాంబో హట్స్‌లో నైట్‌హాల్ట్ సౌలభ్యం కూడా అందుబాటులోకి తెచ్చింది. టికెట్ ధరలు మాత్రం యధాతథంగానే ఉన్నాయి.

పచ్చని కొండల్లో విహారం

చుట్టూ పచ్చని కొండలు, మధ్యలో గోదావరి నదీ ప్రయాణం... చేసే కొద్దీ చేయాలనిపించే లాంచీ ప్రయాణం ప్రారంభం కానుంది. భద్రాచలం నుంచి 50 కిలోమీటర్ల బస్ ప్రయాణం తర్వాత లాంచీ ప్రయాణం సుమారు నాలుగు గంటల పాటు ఉంటుంది. పోచవరం బోటింగ్ పాయింట్ నుంచి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల రెండు ప్రాంతాలను తాకుతూ సాగే ప్రయాణం పర్యాటకుల మనసు దోచేస్తుంది. పచ్చని పాపికొండల నడుమ లాంచీ ప్రయాణం కనువిందు చేస్తుంది. దీంతో భద్రాద్రికి భక్తులు తాకికి భారీగానే పెరగనుంది. హైద రాబాద్, బెంగళూరు, విజయవాడ, గుంటూరు, తెలం గాణ జిల్లాల నుంచి పర్యాటకులు లాంచీ ప్రయాణానికి అమితాసక్తి చూపుతారు. ఇప్పుడు పరిస్థితి మెరుగు పడటంతో విహారానికి ప్రణాళిక సిద్ధం చేసుకుం టున్నారు. తెలంగాణ టూరిజం బస్‌లు అందుబాటులో ఉంచడంతో పర్యాటకులు విహారయాత్రకు సిద్ధం అవుతు న్నారు. లాంచీ ప్రయాణం ప్రారంభం కానుండడంతో వ్యాపారాలు మళ్లీ ఊపందుకోనున్నాయి. విహార యాత్రల వల్ల ఆటోలు, ట్రాలీలు, టాటా ఏస్‌లు పర్యాటకులను చేరవేయడానికి సంసిద్ధమయ్యాయి. మినీ వ్యాపారాలు పూర్వవైభవం సంతరిచుకోనున్నాయి. దీంతో భద్రగిరి పర్యాటకులతో సంక్రాంతి వరకు సందడిగా మారనుంది.

సాహితి

బాలసాహిత్యానికి బంగారు భవిష్యత్

సాహిత్యానికి ఎల్లలు లేవు. తెలుగు సాహిత్యం అనేక రూపాల్లోకి తన అస్తిత్వాన్ని నిలబెట్టుకునే ప్రయత్నం చేస్తున్నది. వాటిలో చెప్పుకోదగ్గది బాలసాహిత్యం. బాలల కోసం రాసే బాలసాహిత్యం. గడచిన కొన్నేండ్లుగా బాల సాహిత్యం విరివిగా ప్రాచుర్యంలోకి వచ్చింది. ఎందరో బాల సాహితీవేత్తలు బాల సాహిత్యాన్ని కొత్త పుంతలు తొక్కిస్తున్నారు. అలాంటివారిలో డాక్టర్ పత్తిపాక మోహన్ ఒకరు. ప్రస్తుతం నేషనల్ బుక్ ట్రస్ట్ ఇండియా తెలుగు సంపాదకులుగా ఉన్న ఆయన రాసిన 'బాలల తాత బాపూజీ' అనే గేయ కథకు కేంద్ర సాహిత్య అకాడమీ 2022 బాల సాహిత్య పురస్కారానికి ఎంపిక చేసింది. నవంబర్ 14న ఢిల్లీలో జరిగే కార్యక్రమంలో పురస్కారాన్ని అందుకుంటున్న సందర్భంగా మోహన్‌తో ప్రత్యేక సంభాషణ.

మాది పూర్వపు కరీంనగర్ జిల్లా సిరిసిల్ల. నేను జనవరి5, 1972న జిల్లా లోని చందుర్తి మండలం లింగంపేటలో అమ్మమ్మ వాళ్లింట్లో పుట్టాను. నా ప్రాథమికవిద్య నుంచి డిగ్రీవరకు స్వగ్రామం సిరిసిల్ల, అగ్రహారంలలో సాగింది. మాది ఉమ్మడి చేనేతకుటుంబం. అమ్మా బాపులు గంగాబాయి- పత్తిపాక లక్ష్మీరాజం. మా బాపు పవర్‌లూం వ్యాపారంతోపాటు రెండుసార్లు పురపాలకసంఘం కౌన్సిలర్‌గా, సెస్ డైరక్టర్‌గా, ఇతరపదవుల్లో కూడా ఉన్నారు. చేనేతకుటుంబంలో పుట్టడంవల్ల ఆ నేపథ్యంలోనే అనేకకవితలు రాశాను.

మా తాతే నా తొలి గురువు.. నేను ఓనమాలు నేర్చుకోవడానికి ముందే వేమన పద్యాలు, కబీరుదాసు పద్యాలు నేర్చుకున్నాను. దీనికి కారణం మా తాత బ్రహ్మశ్రీ పత్తిపాక శంకరయ్య పంతులు. ఆయనతో బాల్యంలో నాకు అనుబంధం ఎక్కువ. దానితో తన ఒడిలో కూర్చోబెట్టుకుని అన్ని రకాల పద్యాలు నేర్పించేవారు. ఇక నాకు చందమామను పరిచయం చేసింది మా మేనత్త పత్తిపాక ఇందిరాబాయి. అన్ని రకాల తెలుగు పత్రికలు, చందమామ వంటి పుస్తకాలు అన్ని ఆమె దగ్గర ఉండేవి. పోలియో కారణంగా ఆమె ఎక్కడికీ కదిలేది కాదు కానీ ఆనాడు ఉన్న అన్ని రకాల తెలుగు పుస్తకాలు, పత్రికలు ఆమె దగ్గరికి వచ్చేవి. చందమామ ప్రారంభ సంచిక కూడా ఆమె చదివిందట. సాయంత్రం స్కూల్ నుంచి వచ్చిన వెంటనే ఆమె దగ్గరికి వెళ్లేవాన్ని. చందమామ కథలు చదవడం, పత్రికలు చదవడం చేసేవాన్ని, యద్దనపూడి నవలలు, సినిమాకథలు, ఇతరనవలలు అన్ని చదివి వినిపించేది. అన్ని రకాల కథలు చాలా వినసొంపుగా చెప్పేది. తను రాట్నం చుడుతూ కథలు చెబుతుంటే సమయం మరిచిపోయి వినేవాన్ని. ఆమె లేకుంటే కవితలు, సాహిత్యం పరిచయం అయ్యేది కావచ్చు కానీ, బాలసాహిత్యం పట్ల మాత్రం అభిరుచి ఏర్పడకపోవును. ఆవిడ దగ్గర ఎన్నో కొత్త కొత్త విషయాలు నేర్చుకున్నాను. ఇందిరత్త నాన్న విశ్వనాథం తాతకు టాకీసు ఉండేది. అందులో రిలీజైన ప్రతి సినిమా చూసేవాన్ని. ఒక వేళ మిస్ అయితే తరువాతి రోజు ఇందిరత్త వాటిని కథల రూపంలో చెప్పేది. అలా నాకు కథలు వినడం పట్ల, చెప్పడం పట్ల ఆసక్తి పెరిగింది. దానివల్లే నేను టీచర్ అయ్యాక పిల్లలకు కథలు, చెప్పడం, పాటలు, పద్యాలు నేర్పే గుణం అబ్బింది.

మహాకవి సినారెతో పరిచయం... నా తొలి కవిత ఏడవ తరగతిలో రాశాను. అది కూడ ఓటు అంశం మీద రాశాను. ఆ తర్వాత అనేక అంశాల మీద కవితలు రాస్తూ వచ్చాను. ఇంటర్ తరువాత జ్ఞానపీఠ పురస్కార గ్రహీత డాక్టర్ సి. నారాయణరెడ్డి పరిచయం నా సాహితీ జీవితాన్ని కొత్త పుంతలు తొక్కించింది. ఆయనతో పరిచయంతో అనేక సభలు, సమావేశాల్లో పాల్గొనే అవకాశం లభించింది. చిన్న వయసులోనే అనేక సాహిత్య సభలకు వ్యాఖ్యాతగా వ్యవహరించే అవకాశం నాకు కలిగింది. అప్పటి నుంచి వెను తిరిగి చూసుకోవలసిన అవకాశం రాలేదు. మా ప్రాంతంలో పరిచయం అయిన సాహితీవేత్తలతో అనేక సభల్లో , కవి సమ్మేళనాల్లో పాల్గొంటూ వచ్చాను. శ్రీశ్రీ మహాప్రస్థానం, అలిశెట్టి ప్రభాకర్ కవిత్వం అప్పుడే పరిచయ మైంది. ఆ వయసులో పుస్తకాలు విరివిగా చదివేవాన్ని. అది నా సాహితీ ప్రస్థానానికి మెరుగులు దిద్దుకునేందుకు దోహదపడింది. చదువుకొనే రోజు ల్లోనే 'కవిత్వం' పేరుతో ఒక లిఖిత పత్రిక కూడా నడిపిన అనుభవముంది. ఆ అనుభవం ఆ తర్వాతి నా సాహిత్య ప్రస్థానానికి ఎంతగానో దోహదపడింది. సినారె స్ఫూర్తితో 1989లో మానేరు రచయితల సంఘం స్థాపించాం.



నాతోపాటు యువకవులు ఎలగొండ రవి, మ్యాన శ్రీనివాస్, ప్రవీణ్, కనపర్తి ప్రదీప్, గుడ్ల అనిల్, సామల మహేశ్ తదితరులు సభ్యులుగా ఉండేవారు.

డిగ్రీ తరువాత పీజీ చదవడం కోసం ఉస్మానియాకు రావడం నా సాహితీ ప్రపంచాన్ని విస్తృత పరిచింది. తెలంగాణ ఉద్యమంతో పరిచయం నన్ను మరింత ఉత్సాహపరిచింది. అదే సమయంలో తెలంగాణ లిబరేషన్ స్టూడెంట్ ఆర్గనైజేషన్ తదితర సంస్థలతో పరిచయం నన్ను నాకే కొత్తగా పరిచయం చేసింది. ఆ సందర్భంలో నగరంలో జరిగిన అనేక సాహిత్యసభలు, సమావేశాల్లో పాల్గొనే అవకాశం కలిగింది. రెండేండ్లు అదే ధ్యాసలో ఉన్నాను. ఉస్మానియాలో తెలుగు సాహిత్యంలో ఎం.ఏ.,పీహెచ్ డీ చేశాను.

ఉపాధ్యాయుడిగా... ఆ తర్వాత సిర్పూర్ కాగజ్‌నగర్‌లో సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల-కళాశాలలో తెలుగు రెసిడెంట్‌టీచర్‌గా పనిచేశాను. ఆ సమయంలో సామల సదాశివ, పరిచయమయ్యారు. వారితో పాటు పలువురు ఉర్దూ సాహిత్య మిత్రులు, నారాయణ గౌడ్, తుమ్మూరి వంటి వారు పరిచయ మయ్యారు. ఆచార్య తంగెడ కిషన్‌రావు పర్యవేక్షణలో 2001లో 'తెలుగులో గజల్ ప్రక్రియ సమగ్ర పరిశీలన' పేర తెలుగు గజల్ పై తొలి పరిశోధన చేశాను. తరువాత జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, నాగారంలో తెలుగు పండితునిగా ఉద్యోగం చేశాను. ఆ తర్వాత సిరిసిల్లలో వ్యాపారం కూడా చేశాను. కేంద్ర విద్యా మంత్రిత్వశాఖ, భారత ప్రభుత్వం, న్యూ ఢిల్లీ వారి నేషనల్ బుక్ ట్రస్ట్, ఇండియాలో అసిస్టెంట్ ఎడిటర్‌గా అవకాశం వచ్చింది. ప్రస్తుతం అందులోనే తెలుగు సహాయ సంపాదకునిగా ఉద్యోగం చేస్తున్నాను.

నా కుటుంబం విషయానికొస్తే నా జీవన సహచరి సిరిసిల్ల చందన. హిందీ ఉపాధ్యాయిని. ఎస్.సి.ఈ.ఆర్.టి తెలంగాణలో ప్రస్తుతం డిప్యుటేషన్లో ఉంది, హిందీ భాషోపాధ్యాయిని. మా పెళ్లికి కూడా డాక్టర్ సి. నారాయణ రెడ్డిగారే పెద్దగా నిలిచి జరిపించారు. పిల్లలు అభ్యుదయ్ శంకర్, అనిరుధ్ శంకర్. 1994లో మొదటిసారి ఖడ్గధార' అనే కవితా సంకలనం వేశాం. మిత్రులతో కలిసి తొలకరిచిత్రాలు', కవితా పాంచజన్యం తదితర సంకలనాలు వెలువరించాను. సొంతంగా వేసిన తొలి పుస్తకం 'బంతిపూలు' అలాగే చేనేత కార్మికుల ఆత్మహత్యలపై రాసిన దీర్ఘ కవిత 'తెగినపువ్వు', దీనిని విమర్శకులు చేనేత బతుకుల తొలి దీర్ఘకవిత అన్నారు.

బాలసాహిత్యం వైపు మొగ్గు.. తొంబయ్యో దశకంలో కథలు, కవితలు, వ్యాసాలు, విమర్శ, ఇలా అనేక ప్రక్రియల్లో సాహిత్యం వెలువడినప్పటికీ ప్రధానమైన బాల సాహిత్యం మీద చాలా తక్కువమంది దృష్టి కేంద్రీకరించారు.

దానితో ఇతర భారతీయ భాషల్లో వచ్చినంత బాలసాహిత్యం మన తెలుగు భాషలో రాలేదన్నది వాస్తవం. నేను టీచర్ గా పిల్లలతో కలిసి పనిచేస్తుండటం వల్ల వారికోసం రాయాలనే ఆలోచన కలిగింది తద్వారా బాలసాహిత్యం వైపు అడుగులు పడ్డాయి. తిరునగరి వేదాంతసూరి ప్రోత్సాహంతో 1997 నుంచి 'మొగ్గ' కోసం బాల సాహిత్య రచన ప్రారంభించి, 'పిల్లల కోసం మన కవులు' పేర రాసిన బాలల సాహిత్య వ్యాసాలను 2004లో పుస్తకంగా ప్రచురించారు. ఆ తర్వాత చందమామ రావే' అనే బాలల గేయ సంకలనం వేశాను. దీనికి 2013లో తెలుగు యూనివర్సిటీ వారి బాలసాహిత్య పురస్కారం లభించింది. 2016లో వెన్నెముద్దలు పేరుతో బాలగేయాల పుస్తకం వేశాను.

'పిల్లల కోసం మన కవులు', చందమామ రావే', వెన్న ముద్దలు', ఆకుపచ్చని పాట', ఒక్కేసి పువ్వేసి చందమామ', అఆ ఇఈ', బాలల తాతా బాపూజీ', జయహో! బాల సాహిత్యం', పిల్లల కోసం సినారె కథ'ఇలా అనేక పుస్తకాలు పిల్లల కోసం రాశాను. అంతేకాక పిల్లల కోసం వివిధ భారతీయ భాషలకు చెందిన 35 పుస్తకాలను తెలుగులోకి అనువదించాను. 15 పుస్తకాలు, సంచికలకు సంపాదకత్వం వహించే అవకాశం కూడ లభించింది. పిల్లల కోసం వివిధ భాషల్లో కథలు, కవితలు, పాటలు, గేయాలు రాసే అవకాశం లభించింది. నేషనల్ బుక్ ట్రస్ట్ ద్వారా పలు భాషల్లో పుస్తకాలను ప్రచురించడంతో పాటు తెలుగు నుంచి ఇతర భాషలకు, ఇతర భాషలనుంచి తెలుగులోకి అనువదించే అవకాశం నాకు లభించింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత 5వ తరగతి వరకు పాఠ్యపుస్తకాల తయారీ కోసం ఏర్పాటు చేసిన సంపాదకీయ బృందంలో నేను ఒకడిగా పనిచేశాను.

విరివిగా కార్యశాలలు... బాలసాహిత్యం మీద ఎక్కువగా దృష్టి కేంద్రీకరించిన నేను 2007 నుంచి పూర్తిగా బాలసాహిత్య రచనలు, వికాసం మీదే పనిచేస్తున్నాను. వివిధ సంస్థలు, వ్యక్తుల చేత బాలసాహిత్యానికి అవసరమైన రచనలు చేయించడం, కార్యశాలలు నిర్వహించడం, పుస్తకాలు ముద్రించడం వంటి విషయాల్లో ఎక్కువగా పనిచేస్తున్నాను. నిజానికి బాలసాహిత్యం అంటే మనం రాసింది వారితో చదివించడం ఆసలు కానే కాదు. పిల్లలకు ఏది అవసరమో అదే రాయడం , ఇంకా మంచి పని ఏంటంటే పిల్లలకు ఏది ఇష్టమో గుర్తించి దాన్ని వారే రాసుకునేలా ప్రోత్సహించాలి. దానికి అవసరమైన సహకారం అందించడానికి మనం కృషి చేయాలి. ఆసక్తిగల పిల్లలకు రచనలు చేయడంలో శిక్షణ కూడా ఇప్పిస్తున్నాం. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని పదవతరగతి లోపు విద్యార్థులకు రచనల్లోని మెలకువలను నేర్పించేందుకు 200 లకు పైగా కార్యాశాలలు నిర్వహించి వారిని రచనలు చేసేలా ప్రోత్సహించాం. తద్వారా ఆయా పాఠశాలలకు చెందిన విద్యార్థులు రాసిన కథలతో 30 వరకు పుస్తకాలు వెలువరించాము.

పెరిగిన ఆసక్తి... గతంతో పోలిస్తే బాలసాహిత్యం పట్ల చాలామందికి ఆసక్తి పెరిగింది. ఇప్పుడు బాలసాహిత్యం విరివిగా వస్తున్నది. కేవలం పెద్దలు రాసిన సాహిత్యమే కాకుండా పిల్లలు రాసుకున్న సాహిత్యమూ కూడా అనేక రూపాల్లో వస్తున్నది. గడచిన కొంతకాలంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని పిల్లలు కథలు, కవితలు రాయడమే కాకుండ పుస్తకాలను ముద్రిస్తున్నారు. ఇందులో ఆయా పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల కృషి కూడా ఎంతో ఉన్నది. పిల్లలు వెలువరించిన 300కు పైగా పుస్తకాలు వెలు వడ్డాయి. తెలంగాణ నుంచి కూడా విరివిగా పిల్లలు రాసిన పుస్తకాలు వస్తున్నాయి. గతంతో పోలిస్తే పిల్లల్లో సృజనాత్మకత చాలా వరకు పెరిగింది. వివిధ సంస్థలు పిల్లల్లో రచనాసక్తిని పెంపొందించడం కోసం ప్రత్యేకంగా కార్యశాలలు నిర్వహిస్తున్నాయి. దీంతో వారు కథలు, కవితలు, వ్యాసాలు, గేయాలు రాయడంలో మెలకువలు నేర్చుకుంటున్నారు. ఇవి వారి భవిష్యత్‌లో మంచి రచయితలుగా రాణించడానికి ఎంతగానో దోహదపడుతుంది. బాలసాహిత్యకారులు గరిపల్లి అశోక్, వి.ఆర్. శర్మ, డా.సిరి, మాడభూషి లలితాదేవి, అమరవాది నీరజ, చొక్కాపు వెంకటరమణ వంటివారు బాలల సాహిత్య సృజనశాలల దిశగా ఎనలేని కృషి చేస్తున్నారు. సిరిసిల్లా, ముస్తాబాద్, నిజామాబాద్ ఇలా అన్ని జిల్లా కేంద్రాలు, మండల కేంద్రాల్లో బాలసాహిత్య కార్యశాలలు విరివిగా సాగుతున్నాయి.

పిల్లలు దేవుడితో సమానమంటారు. అందుకే వారికోసం నిర్వహించే కార్యశాలలు బ్రహ్మోత్సవాలకంటే గొప్పవని నేను విశ్వసిస్తాను. ఎంతసేపు మొబైల్ ఫోన్లు, టీవీల్లో కార్టూన్ చిత్రాలకు అలవాటు పడిన పిల్లలను సాహిత్యం వైపు మళ్లించాల్సిన అవసరం ఉన్నది. దీనికోసం పూర్వ మూసధోరణికి స్వస్తి చెప్పి పిల్లలకు ఇష్టమైన రీతిలో రాయడం, ఆధునికతను జోడించే వారిని ఆకట్టుకునేలా వినిపించడం చేయగలిగితే పిల్లల్లో సాహిత్యం పట్ల అభిరుచి పెరుగుతుందన్నది నా నమ్మకం. ఇప్పుడు అదే ప్రయత్నం తెలంగాణ వ్యాప్తంగా సాగుతున్నది. అది విజయవంతం అయితే బాలసాహిత్యానికి స్వర్ణయుగం వచ్చినట్టేనని నా నమ్మకం.

కేంద్ర సాహిత్య అకాడమి బాల సాహిత్య పురస్కారం-2022 కు ఎంపికైన గ్రంథం గురించి.... 'బాలల తాతా బాపూజీ! ఆరు నుండి పన్నెండు సంవత్సరాల పిల్లల కోసం రాసిన గాంధీ గేయాలు, గేయ కథ 'బాలల తాతా బాపూజీ' పుస్తకం. జాతిపిత మహాత్మాగాంధీ 150 వ జయంతి సందర్భంగా, మానేరు రచయితల సంఘం పక్షాన బాల సాహితీవేత్త, మారసం కార్యనిర్వాహక అధ్యక్షులు గరిపెల్లి అశోక్ కుమారుడు, డా. గరిపెల్లి నవీన్- డా. సౌజన్య దంపతులు బాలలకు కానుకగా అందించిన పుస్తకం. సిరిసిల్లకు చెందిన మలితరం విమర్శకులు, అనువాదకులు నిజాం వెంకటేశంకు అంకితం చేశారు. ఇది రెండు భాగాలుగా కూర్చబడిన పుస్తకం. మొదటి భాగం గాంధీ గేయాలు, రెండవ భాగం గాంధీ గేయకథ. మాత్రా ఛందస్సులోని ఈ గేయాలను పిల్లలు స్వయంగా చదివి, పాడుకోవచ్చు. అలతి, అలతి తేట తెలుగు పదాలతో కూర్చబడ్డ గేయాలు ఈ సంకలనానికి అందాన్ని తెచ్చాయి.

బాల్యంలోనే జాతిపిత మహాత్ముని గాంధేయ వాదం గురించి, గాంధీ తత్వం గురించి, గాంధీ వ్యక్తిత్వం గురించి, గాంధేయ మతం గురించి, స్వాతంత్ర్య పోరాటంలో ముందుండి నడిపించిన విధానం గురించి బాలలకు తెలపడమేకాక, పిల్లల మనసుకు హత్తుకునే రీతిలో ఇందులోని గాంధీ గేయాలు నడిచాయి. 'జోతలివే అందుకొనుము గాంధీతాత! భరతజాతి కంతటికి స్ఫూర్తి ప్రధాత శిరమెత్తిన స్వేచ్ఛకు నీ పిలక ప్రతీక/ నీ బోసినవ్వే కదా భరతజాతి జ్ఞాపిక' 'సబర్మతి మౌనివి / సహకార జ్యోతివి / శాంతియుద్ధ వీరునివి / సత్యధర్మ మార్గానివి' 'నిన్ను చూసి మురిసింది / భరతావని గాంధీతాత, నీ బోసి నవ్వుచూసి / మైమరచింది. గాంధీతాత'

'పంద్రా ఆగస్టురోజు మనకు పండుగ రోజు / ఎర్రకోట మీద జండా ఎగిరిన రోజు' వంటి ఇందులోని గేయ పంక్తులు గాంధీ వ్యక్తిత్వాన్నే కాక రచనలోని సౌకుమార్యాన్ని తెలిపి, పిల్లలనే కాదు పెద్దలను ఆకర్షిస్తాయి. 'ఉద్యమమే గాంధీగా / గాంధీయే ఉద్యమంగ / దేశమంత కదిలింది / అడుగు అడుగు కదిపింది' అంటూ కళ్ళకు కట్టినట్టు కథను, పాఠకులకు నచ్చేట్టు గేయాన్ని నడపడం కవి పత్తిపాక మోహన్‌కు బాగా తెలిసిన విద్య. మాత్రాఛందస్సులో మోహన్‌కున్న పట్టు, గేయకథా చక్రవర్తి డా. సి.నారాయణ రెడ్డిగారి స్ఫూర్తి మోహన్ ఈ గేయాల్లోని అక్షరమక్షరంలో కనిపిస్తుంది.

అన్వేషికా, 9849848819

అభ్యుదయం'ఆవంత్స' పథం!!

-వి.ఎస్.ఆర్.ఎస్.సోమయాజులు
సెల్: 9441148158

తెలుగుల- వెలుగు- సారస్వత కేతనం!
"ధీ" శక్తి- ప్రసరణాల వజ్రాయుధం!!
పేరులోనే సోముడు- సాహిత్యాంతరంగం
బహుముఖీనతల సహస్ర కిరణాల- భాన్వంతం!
అక్షరా దేశికుల దృష్టి పథం నిండా
ఎర్ర దీపాల తోరణాలే జాపించాలి
అక్షరాలు ఆవహించిన హృదయాలు
పద విన్యాసాల చైతన్యపు చిరునామాలు
అయినప్పుడే- పద ఘట్టనలు
ప్రతి ఘటనలు - ప్రతి రూపాల్లోంచి పోరు బావుటాలు
ఉదయించిన కోమల గాంధర్వాలు- అమృత వీచికలు
నిషాదం నుంచి - విషాదం లేచి
పుడమి అంచుల కెగిరిపోవాలి
అన్న అవిరళ స్వాపికత్వం సో॥సు॥
కాలం వెంబడి జయంతులు- వర్ధంతులు
ఆ భౌతిక తంతు నిష్టగా లేకున్నా- మాటలు
పరిమళాలు మట్టి నుంచి- జ్ఞాన సిక్తాలే కదా!!
గోదావరి తరంగిత్ ప్రవహిమల్లోకి
తరంగితాల మోదుగు పూలు ఎర్రని కాంతులు
అక్షరాల వర్తమానానికి "శాబ్దిక సింహం" కావ్య కాహళులు

'కవి స్వరం'కు ఆహ్వానం

55 వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా "కవి స్వరం" కవి సమ్మేళనాన్ని నిర్వహిస్తున్నారు. నవంబరు 15 వ తేది మంగళవారం సాయంత్రం 6 గంటలకు ఠాగూర్ స్మారక గ్రంథాలయం, బందరురోడ్డు, విజయవాడ నందు జరుగును. సభాధ్యక్షులుగా సోమేపల్లి వెంకట సుబ్బయ్య, అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం, ముఖ్య అతిథిగా కప్పగంతు రామకృష్ణ, సభ్యులు, ఆంధ్రప్రదేశ్ తెలుగు, సంస్కృత అకాడమీ, గౌరవ అతిథిగా శ్రీమతి తిప్పరమల్లి జమలపూర్ణమ్మ, చైర్‌పర్సన్, కృష్ణాజిల్లా గ్రంథాలయ సంస్థ వ్యవహరిస్తారు. కవి సమ్మేళన నిర్వహణ శ్రీమతి కోపూరి పుష్పాదేవి, ప్రముఖ కవయిత్రి నిర్వహిస్తారు. ఈ సమ్మేళనానికి అందరూ ఆహ్వానితులే.

చలపాక ప్రకాష్,
ప్రధాన కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం

రంగుల్ని మించిన అనుభవాలు

నిద్రకు ఉపక్రమిస్తున్న సమయంలో
కళ్ళనుండి కన్నీరు వెచ్చగా రాలాయి!
అవి బాధతో వచ్చిన చుక్కలో...
ఆనందంతో ఒలిగి తడిపిన పక్కలో..
వేడిచేసి కారిన వంకలో..
నలుసుపడి నలుపుకున్న కన్నీటి సుడులో...
అది అనుభవించినవాడికే తెలుస్తుంది!
అనుభవం ఎన్ని రంగుల్లో పెనవేసుకుని ఉందో..
అని వర్ణిస్తాంగాని-
రంగులకంటే అనుభవాల సంఖ్యే ఎక్కువని
తెలుసుకోలేం!
క్షణానికొక అనుభవం...
రోజుకొక అనుభవం...
జీవితాలకెన్ని..?
యుగానికెన్ని..?? కాలానికెన్ని...???
అంచనా వెయ్యడం ఎవరి తరం?!
అనుభవాల సారమే పుస్తకాలమయం!
పాత, కొత్తమనుషుల
అనుభవాల దొంతరలే గ్రంథాలయం...!!
కాలగర్భంలో కలిసిపోయే అనుభవాల దొంతర్లని
దాచి భద్రపరిచే సాధనం పుస్తకాలయం!
తరతరాల తలలలో దాచి వడబోసిన డికాషన్‌ని
నులివెచ్చని పాలలో కలగలిపి కాచి
కిక్కిచ్చే 'టీ'లాంటి విజ్ఞాన ఘనే మన గ్రంథాలయం!
మానవజాతి మెదళ్ళను
మెదళ్ళతో సహా సాక్ష్యంగా చూపించే
పరిశోధనాభాండాగారం మన గ్రంథాలయం!!

(నవంబర్ 14 నుంచి 20 వరకు జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా)

సిహెచ్. ప్రకాష్

మరిన్ని 'ఆజిరి'లు రావాలి!

గ్రంథ సమీక్ష

ఈ యేడాది మే 29న పిల్లా తిరుపతిరావు సాహిత్యవ్యాసాల సంపుటి 'ఆజిరి' ఆవిష్కరణ రాజాం రచయితలవేదిక సభలో జరిగింది. ప్రముఖ విమర్శకులు లక్ష్మీనరసయ్య ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆ సందర్భంగా నేను కూడా పాల్గొన్నాను. ఆ సభలో లక్ష్మీనరసయ్య ఉపన్యాసం సాహిత్యవిమర్శలో శ్రామికకులాల స్థానం ప్రముఖంగా వుండాలనీ, శ్రామికకులాల సమూహమే బహుజనమనీ, బహుజనసాహిత్య ప్రాముఖ్యతను సామాజిక, రాజకీయ, సాంస్కృతిక నేపథ్యంలో వివరించారు. ఇదంతా ఎందుకు చెప్తున్నానంటే లక్ష్మీనరసయ్య ఉపన్యాసానికి ప్రేరణ...పిల్లా తిరుపతిరావుగారి 'ఆజిరి'.

నాకప్పుడే అన్పించింది పిల్లా తిరుపతిరావు మరిన్ని 'ఆజిర్లు' రచించాల్సిన అవసరముందని! ఆ 'ఆజిర్లు'లో కళింగాంధ్రా సాహిత్యానికి సంబంధించిన వ్యాసాలే యెక్కువగా వుండాలని! ఎందుకంటే - వర్తమాన కళింగాంధ్రా సాహిత్యం బహుజన సాహిత్యమే గనక. బహుజన రచయితలు అధికంగా ఉన్నారు. బహుజన జీవితాన్ని వివిధ కోణాల్లో ఆవిష్కరిస్తున్నారు. గతంలో సాహిత్యంలోకి రాని జీవితదృశ్యాల్ని వర్తమాన రచయితలు అక్షరీకరిస్తున్నారు. ఈ నేలలో తొలినాట సంస్కరణవాద సాహిత్యం వస్తే, తర్వాత అభ్యుదయ సాహిత్యం, విప్లవ సాహిత్యం రాగా యిపుడు బహుజనసాహిత్యం వస్తోంది. కాకపోతే తొలినాటలా విమర్శకుల దృష్టి యిటు సోకటంలేదు. కళింగాంధ్రా సాహిత్యాన్ని ఆరంభంలో అంటే తొలినాట గురజాడ కాలం నుంచీ యేభయ్యేళ్లపాటు తెలుగునేల యావత్తూ చదివింది, చర్చించింది, అభిమానించింది, గౌరవించింది, సుమారుగా రా.వి.శాస్త్రి, కాళీపట్నం రామారావు దాకా!

కానీ ఆ తర్వాత కళింగాంధ్ర సాహిత్యమ్మీద అంతగా తెలుగునేల స్పందన, ముఖ్యంగా విమర్శకుల దృష్టి సన్నగిల్లింది. తొలినాళ్ల నుంచీ కళింగనేల నుంచి సాహిత్య విమర్శ కులంతగా రాలేదు. ఇక్కడి సాహిత్యాన్ని కళింగేతరులే సమీక్షించారు. ఇప్పటికీ విమర్శకుల లోటు కళింగనేలలో వుంది. ఏ ఒకరిద్దరో వుండినా విమర్శరంగాన్ని తమ లక్ష్యంగా పెట్టుకోలేదు, ప్రత్యేక కృషి చేయటంలేదు. పిల్లా తిరుపతిరావు యిందుకు మినహాయింపు. విమర్శరంగానికి తనదైన పాత్ర పోషించటానికి కృషి చేస్తున్నారు. కళింగనేల నుంచి యిలా తిరుపతిరావు రావటం వర్తమాన కళింగసాహిత్యానికి యెంతో ఉపకరిస్తుంది. 'ఆజిరి' వ్యాససంపుటిలో ముప్పయి వ్యాసాలుండగా, పదిహేడు వ్యాసాలు కళింగ రచయితల రచనల మీద రాసిన వ్యాసా లున్నాయి. ఈ సంఖ్య యింకా పెరగాలని కోరుకుంటున్నా. ఎందుకంటే అస్తిత్వ వాదాలు, పోరాటాలు వచ్చాక ప్రాంతీయ అస్తిత్వదృష్టి అన్ని నేలల్లో ముఖ్యమైంది. కళింగనేలలో అదింకా అలవడలేదు. బహుశా... దీర్ఘకాల పోరాటబాట చూపే కమ్యూనిస్ట్, నక్సలైట్ భావజాల ప్రభావం కారణం కావచ్చు. ఇపుడిపుడే ప్రాంతీయ అస్తిత్వ దృష్టి యేర్పడుతోంది. అస్తిత్వవాదమేమీ దోషం కాదు, తమ వనరులు తమప్రాంతానికి చెందాలన్న భావన ముఖ్యమయిన ప్రాంతీయ అస్తిత్వమనేది...సర్వవ్యాపిత వనరులను ప్రపంచీకరణ ముసుగులో కార్పొరేటీకరణ చేసే విధానాలకు ప్రత్యామ్నాయం! ఈ నేపథ్యంలో 'ఆజిరి' మరిన్ని రావాలని కోరుతున్నా.

ఆజిరి (సాహిత్య వ్యాసాలు)
పిల్లా తిరుపతిరావు
వెల:150/-
ప్రతులకు: పిల్లా తిరుపతిరావు, పిల్లా వీధి, ఆగూరు కంచరాం, రాజాం, విజయనగరంజిల్లా.532127

అసలు 'ఆజిరి' అన్న శీర్షికే కళింగ పదజాలం. పల్లెజనులు వంట సరుకుకోసం కట్టెలను ఇంటి పెరడులో గానీ, కళ్లాల్లో గానీ ఒక పద్ధతిలో కుప్పబోస్తారు, దాన్నే ఆజిరి అంటారు. రావటం,రావటమే కళింగపదజాలంతో తన వ్యాససంపుటికి శీర్షిక పెట్టడంతో తిరుపతిరావు యీ నేలలో విమర్శా రంగంలోని యిప్పటిదాకా వున్న లోటును పూరించడానికి వచ్చాడన్న నమ్మకమిచ్చారు.

పద్యం, పాట, కవిత్వం, గజల్లు, కథ, నవల, సామెతలు వంటి విభిన్న రచనలను తిరుపతిరావు 'ఆజిరి'లో సమీక్షించారు. ఇవి 2018 నుంచి 2021 వరకు రాసిన వ్యాసాలు. మూడేళ్ల కాలంలో రాసినా, సమీక్షించిన అంశాలు మూడేళ్లలో వచ్చిన రచనల మీద మాత్రమే కాదు గతంలో వచ్చిన రచనల మీద, రచయితల మీద చేసిన సమీక్షలు. పద్యకవుల నుండి ఆధునిక కవులదాకా, వాగ్గేయకారులు, ప్రజాగాయకులు గరిమెళ్ల నుండి వంగపండు దాకా, గురజాడ, రావిశాస్త్రి, చాసోల నుండి వర్తమాన కథకులదాకా, శ్రీశ్రీ, సీరపాణి, ఛాయరాజ్ నుండి గంటేడ గౌరునాయుడు, సిరికి స్వామినాయుడు, లండ సాంబమూర్తి దాకా కవుల రచనల మీద తిరుపతిరావు ఇందులో సమీక్షించారు. కళింగేతర రచనలు రాయప్రోలు సుబ్బారావు, జాషువా రచనలమీద, అంతర్జాతీయ రచయితల రచనలమీదకూడా యిందులో వ్యాసాలున్నాయి. ముఖ్యంగా నోబెల్ సాహిత్య బహుమతి పొందిన 'లూయిస్ గ్రిక్' రచనా నేపథ్యానికి సంబంధించిన వ్యాసం వుండడం తిరుపతిరావు విశాలదృష్టికి ఉదాహరణ!

తిరుపతిరావు రచనాశిల్పం...వచనరచనలా వుంటుందే కానీ అది జానపదుల సంభాషణలా వుంటుంది. జానపదులేమీ మేధావుల్లా మాటాడరు. కానీ మాటల్లో చమత్కారం, సౌందర్యం, సామరస్యతా వుంటాయి. ఇవన్నీ 'ఆజిరి'లో మనం చూస్తాం.నిజానికి విమర్శ అనేది మేధావులకు సంబంధించిన రంగమనేది సర్వత్రా స్థిరపడిన అభిప్రాయం. రచనలో పాఠకుడు గమనించలేని అంశాలను, రచయిత చూపీ,చూపని అంశాలను విమర్శకులు విప్పి చూపుతారు. పాఠకునికి ఒక మెట్టు మీదన వున్నవాడు విమర్శకుడనే అభిప్రాయం ప్రచారంలో వుంది. నిజం కూడా కావచ్చు, అయితే వీరి విమర్శ వ్యక్తీకరణ సులభశైలిలో వుండాలి, మేధస్సంతా చర్చచేసిన అంశంలో విషయాల్ని వెలికితీయడానికి మాత్రమే వినియోగించి, ఆ విషయాల్ని వివరించి నపుడు సాధారణ పాఠకుడికి చేరేట్టు సాధారణ శైలిలో రాయాల్సిన అవసరం వుంది. పిల్లా తిరుపతిరావు ఆ విధంగా తన రచన సాగించారు. చర్చించదలచుకున్న, సమీక్ష చేయదలచిన, విమర్శించ దలచుకున్న అంశాలను తిరుపతిరావు సంపూర్ణంగా వివరిస్తూ, వాటిలోని కీలకమైన అంశాన్ని ఎత్తి చూపుతారు. వివాదమైన జానపద బాణీలు, పాటల మీద...దాని కుడీభుజం పాట వివాదసందర్భాన్ని కూడా తిరుపతి రావు చర్చించారు. వీటిపట్ల మనం యేర్పరచుకోవాల్సిన అభిప్రాయాన్ని సూచించారు. గంటేడ గౌరునాయుడు రాసిన 'పాడుదుమా స్వేఛ్ఛాగీతం' మహారాష్ట్ర విద్యాశాఖ తొమ్మిదవ తరగతి విద్యార్థులకు పాఠ్యాంశం చేసిన సందర్భాన్ని పురస్కరించుకొని రాసిన వ్యాసం...యీ దేశ స్వాతంత్ర్యం కోసం సాగిన పోరాటాన్ని ఆ గీతం యెలా అక్షరీకరించిందో గొప్పగా వివరించారు. పీడిత కవితా బావుటాగా 'జాషువా' కవిత్వాన్ని పలవరించారు. కథల కర్షకుడని రాయలసీమ రైతుకథకులు సింగమనేని నారాయణను పటంగట్టిచూపారు. వర్ధమానకథకుడు దాసరి రామచంద్ర రావు 'అల్పపీడనం' కథాసంపుటినీ, అట్టాడ అప్పల్నాయుడి 'బహుళ' నవలనీ విశిష్టంగా వివరించారు. పిల్లా తిరుపతిరావు 'ఆజిరి'లో యీ మూడేళ్లలో వచ్చిన ముఖ్యమైన అన్ని రచనలపై వ్యాసాలున్నాయి, కొత్తగా వచ్చిన యీ కళింగాంధ్రా విమర్శక కంఠానికి తెలుగునేల స్వాగతిస్తుందని ఆశిస్తాను.

అట్టాడ అప్పల్నాయుడు

మతసామరస్యానికి ప్రతీక

- కేరళ ఇస్లామిక్ ఇన్‌స్టిట్యూట్‌లో అరబిక్‌తో పాటు సంస్కృతంలో పాఠాలు
- శ్లోకాలు-మంత్రాలు నేర్పుతున్న హిందూ గురువులు
- అన్ని మతాలపై పిల్లలకు అవగాహన కల్పించడమే లక్ష్యం: ఏఎస్ఏఎస్

త్రిస్సూర్: ముస్లిం విద్యార్థులకు సంస్కృతంలో పాఠాలు చెబుతూ, శోక్లాలు, మంత్రాలు నేర్పుతూ కేరళ, త్రిస్సూర్ జిల్లాల్లోని ఇస్లామిక్ ఇన్‌స్టిట్యూట్ మతసామరస్యాన్ని చాటుతూ ఆదర్శంగా నిలుస్తోంది. దేశంలో విద్య కాషాయీకరణపై దుమారం వేళ ఖుర్ఆన్, అరబిక్, ఉర్దూతో పాటు భగవద్గీత, పురాణాలు బోధిస్తూ ప్రశంసలు అందుకుంటోంది. మలిక్ దీన్‌దార్ ఇస్లామిక్ కాంపెక్స్ (ఎంఐసీ) ఆధ్వర్యంలోని అకడమీ ఆఫ్ షరియా అండ్ అడ్వాన్స్‌డ్ స్టడీస్ (ఏఎస్ఏఎస్) తమ విద్యార్థులకు హిందూ గురువులతో సంస్కృతంలో శోకాలు, మంత్రాలు నేర్పుతోంది. గురుశిష్యుల మధ్య సంస్కృతంలో సంభాషణలు ఇక్కడి ప్రత్యేకత. సంస్కృతం, ఉపనిషద్లు, పురాణాలు తదితరాలను పిల్లలకు నేర్పడం వెనుక ఇతర మతాలపై అవగాహన కల్పించడం, పరిజ్ఞానాన్ని పెంచడమే తమ ఉద్దేశం అని ఎంఐసీ- ఏఎస్ఏఎస్ ప్రధానోపాధ్యాయులు ఓనంపిల్లి మహమ్మద్ ఫైజీ తెలిపారు. తాను స్వయంగా శంకర తత్వశాస్త్రాన్ని చదవడం కూడా పిల్లలకు సంస్కృత బోధనకు మరొక కారణమన్నారు. భగవద్గీత, ఉపనిషద్లు, మహాభారతం, రామాయణంలోని కీలక అంశాలను పిల్లలకు బోధిస్తున్నామని, పదవ తరగతిలో ఉత్తీర్ణత సాధించే వరకు అంటే ఎనిమిదేళ్ల విద్యాభ్యాసంలో వారు వీటిపై పట్టుసాధిస్తారని చెప్పారు. తమది కాలికట్ విశ్వవిద్యాలయ అనుబంధ షరియా కళాశాల అని, ఆర్ట్స్‌లో డిగ్రీ కోర్సులతో పాటు ఉర్దూ, ఆంగ్ల భాషల్లో ప్రవీణులుగా విద్యార్థులను తీర్చిదిద్దుతుందని ఫైజీ తెలిపారు. పిల్లలపై విద్యాపరంగా భారం ఎక్కువగానే ఉంటుందని, దానిని తట్టుకునే సమర్థులు మాత్రమే తమ ఇనిస్టిట్యూట్‌లో ప్రవేశం పొందగలరని, అందుకోసం ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. అరబిక్ తరహాలోనే సంస్కృతం మొదట్లో కష్టంగా ఉన్నా తర్వాత అలవాటు అవుతుందన్నారు. సంస్కృతం నేర్చుకోవడానికి పిల్లలు కూడా ఆసక్తి కనబరుస్తున్నారని ఫైజీ చెప్పారు. ఫ్యాకల్టీ ప్రొఫెసర్ కేకే యధీంద్రన్ మాట్లాడుతూ, ఈ వ్యవస్థలో బోధించేందుకు తనను ఆహ్వానించినప్పుడు ఒక హిందువుగా అరబిక్ విద్యాసంస్థలో పాఠాలు చెప్పేందుకు అంగీకరిస్తారో లేదో అని ఫైజీ సందేహపడ్డారు. నాకు అలాంటి పట్టింపులు లేవని, బోధించేందుకు సిద్ధమని ఆయనతో చెప్పాను' అని అన్నారు. నుదుట చందనంతో తిలకం దిద్దుకొని రోజూ ఇనిస్టిట్యూట్‌కు వెళుతుంటే ఎందుకని ప్రశ్నించేవారికి సంస్కృతం నేర్పేందుకని సమాధానమిస్తాను. వారు మెచ్చుకుంటారు అని తెలిపారు. ఇప్పటివరకు ఏ వర్గం నుంచి అభ్యంతరాలు రాలేదని ఫైజీ కూడా చెప్పారు. మరొక గురువు డాక్టర్ రమేశ్ మాట్లాడుతూ, ఇక్కడికి రాకముందు సంస్కృతాన్ని విద్యార్థులు నేర్చుకోలేదు. వారికి దశలవారీగా పద్యాల నుంచి శ్లోకాల వరకు బోధిస్తున్నాం' అని తెలిపారు. శ్రీశంకరాచార్య సంస్కృత విశ్వవిద్యాలయం పూర్వ ప్రొఫెసర్, డాక్టర్ సీఎం నీలకండన్, కేరళ విశ్వవిద్యాలయం, సంస్కృత విభాగాధిపతి, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ షంషీర్ పీసీ కూడా ఫ్యాకల్టీ సభ్యులుగా ఉన్నారు. ఇనిస్టిట్యూర్ సమన్వయకర్తల్లో ఒకరైన హఫీజ్ అబూబకర్ మాట్లాడుతూ, ఇస్లాం గురించి తెలుసుకోవడం, నేర్చుకోవడం ముఖ్యం. అలాగే ఇతర మతాలపై అవగాహన అవశ్యం. అందుకే సిలబస్‌లో సంస్కృతాన్ని చేర్చాం. తద్వారా పిల్లలకు ఇతర మతాల చరిత్ర, పురాణాల గురించి తెలుస్తుంది. ఇతరుల భావజాలాన్ని అర్థం చేసుకోగలుగుతారు. నవభారతం దిశగా కొత్త ఆరంభానికి ఇది నాంది కావాలన్నదే. లక్ష్యం' అని అన్నారు.

ఆ పోలింగ్ బూత్‌లో 100 శాతం ఓటింగ్

హిమాచల్‌లో ప్రశాంతంగా ముగిసిన ఎన్నికలు

సిమ్లా: హిమాచల్‌ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన ప్రదేశంలో ఉన్న తాషిగాంగ్ పోలింగ్ బూత్‌లో వంద శాతం ఓటింగ్ నమోదయింది. గడ్డకట్టే చలిలోకూడా ప్రజలు తమ ఓటుహక్కు వినియోగించుకుని అందరికీ ఆదర్శంగా నిలిచారు. రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటుచేసిన 7884 పోలింగ్ కేంద్రాల్లో 66.58 శాతం ఓటింగ్ నమోదైందని ఎన్నికల సంఘం ప్రకటించింది. ఇది గతంలోకంటే తొమ్మిది శాతం తక్కువ అని తెలిపింది. సముద్రమట్టానికి 15,256 అడుగుల ఎత్తులో ఉన్న తాషిగాంగ్ పోలింగ్ బూత్ పరిధిలో మొత్తం 52 మంది ఓటర్లు ఉండగా అందరూ ఓటుహక్కు వినియోగించుకుని రికార్డుల్లో నిలిచారు. ఇక సిర్మౌర్ జిల్లాలో 72.35 శాతం, సోలన్‌లో 68.48 శాతం మంది ఓటు వేశారు. అత్యల్పంగా లాహౌల్, స్పిటిలో 21.95 శాతం పోలింగ్ నమోదైంది. సీఎం జైరాం ఠాకూర్ ప్రాతినిధ్యం వహిస్తున్న సెరాజ్ నియోజకవర్గంలో 74 శాతం మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. మంచు ప్రభావం ఎక్కువగా ఉన్నా భార్మౌర్ నియోజకవర్గంలో 83 ఏళ్ల మహిళ చాసక్ భత్రి ఓటు వేసి పలువురికి ఆదర్శంగా నిలిచారు. స్వతంత్ర భారత తొలి ఓటరు శ్యామ్ శరణ్ నేగి (106) పోస్టల్ బ్యాలెట్ ఓటు వేసి తనువు చాలించిన విషయం తెలిసిందే.

చర్యలు తప్పవ్

ఎల్డీఎఫ్ ప్రభుత్వానికి గవర్నర్ బెదిరింపు



తిరువనంతపురం/న్యూఢిల్లీ: కేరళ ప్రభుత్వం పంపిన ఆర్డినెన్స్‌లో తనను లక్ష్యంగా చేసుకుంటే చర్యలు తీసుకుంటానని గవర్నర్ ఆరిఫ్ మహమ్మద్ ఖాన్ హెచ్చరించారు. రాజ్‌భవన్‌కు ఆర్డినెన్స్ పంపడం వెనుక ఎల్డీఎఫ్ ప్రభుత్వ ఉద్దేశం తనను లక్ష్యంగా చేసుకోవడమేనన్నారు. దీనిపై తన నిర్ణయాన్ని ప్రకటించనని, రాష్ట్రపతికి పంపుతానని న్యూఢిల్లీలో విలేకరులతో మాటాడిన ఖాన్ అన్నారు. అయితే తాను ఇంకా ఆర్డినెన్స్‌ను చూడలేదని, దానిని పరిశీలించిన తర్వాత ఏం చేయాలో నిర్ణయిస్తానని చెప్పారు. తనను లక్ష్యంగా చేస్తే రాష్ట్రపతికి పంపుతానని ఖాన్ అన్నారు. రాజ్యాంగానికి కట్టుబడి గవర్నర్ వ్యవహరిస్తారని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోందని తిరువనంతపురంలో విలేకరులతో మంత్రి ఎంబీ రాజేశ్ అన్నారు. 'రాజ్యాంగం కల్పించిన అధికారాలను ప్రభుత్వం వినియోగించి ఆర్డినెన్స్‌ను గవర్నర్‌కు పంపించింది. ఇది న్యాయమైనది. రాజ్యాంగబద్ధమైనది. నియమ నిబంధనల ప్రకారం రూపొందినది. కాబట్టి ప్రతి ఒక్కరు రాజ్యాంగబద్ధంగా వ్యవహరిస్తారని ఆశిద్దాం' అని తెలిపారు. ఖాన్ శనివారం సాయంత్రం ఢిల్లీ వెళ్లినట్లు రాజ్‌భవన్ వర్గాలు తెలిపాయి.

స్కైరూట్ ఉపగ్రహ ప్రయోగం 18కు వాయిదా?

న్యూఢిల్లీ: ప్రతికూల వాతావరణం కారణంగా భారత్‌లో మొట్టమొదట ప్రైవేటుగా అభివృద్ధిపర్చిన రాకెట్ 'విక్రమ్-ఎస్' ప్రయోగం నవంబరు 18కి వాయిదా పడింది. ఈ మేరకు రాకెట్ తయారీ సంస్థ హైదరాబాద్‌కు చెందిన స్కైరూట్ ఏరోస్పేస్ ఆదివారం వెల్లడించింది. శ్రీహరికోటలోని భారత అంతరిక్ష పరిశోధక సంస్థ (ఇస్రో) లాంచింగ్ ప్యాడ్ నుంచి దీనిని ప్రయోగించనున్నారు. నవంబరు 18 ఉదయం 11:30 గంటలకు ప్రయోగం జరిగే అవకాశం ఉందని స్కైరూట్ ఏరోస్పేస్ ప్రతినిధి తెలిపారు. ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారమైతే నవంబర్ 15న ప్రయోగం జరగాల్సి ఉంది. స్కైరూట్ ఏరోస్పేస్ తొలి మిషన్ ఇది. 'ప్రారంభ్' పేరుతో ఇద్దరు భారతీయ, ఒక విదేశీ కస్టమర్ పేలోడ్‌లను కక్ష్యలోకి తీసుకువెళుతుంది. ఈ మిషన్ స్కైరూట్‌కు ఒక ముఖ్యమైన మైలురాయిగా భావిస్తున్నారు. ఎందుకంటే ఇది వచ్చే ఏడాది ప్రయోగించనున్న విక్రమ్-1 ఉపగ్రహ వాహక నౌకలో ఉపయోగించే 80 శాతం సాంకేతికతలను ధృవీకరించడంలో సహాయపడుతుంది.

చెన్నైలో కుంభవృష్టి

- నీటమునిగిన అనేక ప్రాంతాలు
- రోడ్లు ధ్వంసం...కట్టలు తెగిన చెరువులు
- కావేరి డెల్టా ప్రాంతంలో నేడు సీఎం పర్యటన

చెన్నై: తమిళనాడును భారీ వర్షాలు ముంచెత్తుతున్నాయి. అల్పపీడన ప్రభావంతో రాష్ట్రంలో కుండపోతగా వర్షాలు కురుస్తున్నాయి. చెన్నై, మధురై, కడలూరు, తిరువళ్లూరు, కోయంబేడు, కాంచీపురం, చెంగల్‌పట్టులో ఎడతెరపిలేకుండా వాన పడుతోంది. భారీవర్షాలకు మైలాడుదురై సహా రాష్ట్రంలోని చాలా ప్రాంతాలు నీటమునిగాయి. వరద పోటెత్తడంతో చెరువు కట్టలు తెగి రోడ్లు ధ్వంసమయ్యాయి. ఊటీ ఘాట్‌రోడ్డుపై వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. కోయంబత్తూరులోని డ్యామ్‌లు పూర్తిగా నిండిపోయాయి. ఏకధాటిగా కురుస్తున్న వానలకు ప్రజలు అల్లాడిపోతున్నారు. చెన్నైలో రోడ్లన్నీ జలమయమయ్యాయి. డ్రైనేజీలు పొంగి పొర్లుతున్నాయి. పలు కాలనీలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. చాలాచోట్ల పంట పొలాలు నీట మునిగాయి. రోడ్లపై భారీగా వరదనీరు చేరడంతో ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ప్రకటించింది.

కావేరీ డెల్టా ప్రాంతంలోని వర్ష ప్రభావిత ప్రాంతాలను త్వరలో పరిశీలించనున్నట్లు తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ తెలిపారు. ఉత్తర చెన్నైలోని ప్రాంతాలను పరిశీలించిన ఆయన మైల్‌దుతిరై జిల్లాలోని సిర్కాజీను సోమవారం సందర్శించనున్నట్టు పేర్కొన్నారు. అక్కడ చాలాప్రదేశాల్లో వరద నీళ్లు నిలబడలేదని స్థానికులు చెప్పారని స్టాలిన్ తెలిపారు. తమిళనాడు, సమీపాన ఉన్న పుదుచ్చేరిలో సోమవారం నుంచి వానలు తగ్గే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. కావేరీ డెల్టా పరిధిలోని సిర్కాజీ వర్షాల కారణంగా సాధారణ జనజీవనం అస్తవ్యస్తమైంది. అనేక పంటలు నీట మునిగాయి. విద్యుత్ నిలిచిపోయింది. సిర్కాజీ పరిధిలో 44 సెంటీమీటర్ల వర్షపాతం కురిసింది. ఇది అన్నింటి కన్నా ఎక్కువ. డెల్టాపరిధిలోని మిగిలిన ప్రాంతాల్లో కూడా భారీ వర్షాలు పడ్డాయి. సిర్కాజీలో విద్యుత్ మరమ్మతులను ఆ శాఖ మంత్రి సెంథిల్ బాలాజీ పర్యవేక్షించారు. నిరంతరాయంగా విద్యుత్ ఇచ్చేలా పనులు త్వరితగతిన చేపట్టాలని విద్యుత్ సిబ్బందిని ఆదేశించారు.

రైళ్లు ఆపనందుకే ఎన్నికలు బహిష్కరిస్తున్నాం

18 గ్రామాల్లో ప్రచారానికి జంకుతున్న నేతలు

బ్యానర్లు చూసి తలపట్టుకుంటున్న బీజేపీ నాయకులు

గాంధీనగర్: గుజరాత్ రాష్ట్రం నవ్‌సారి నియోజకవర్గ పరిధిలోని అంచెలి రైల్వే స్టేషన్‌లో లోకల్ రైళ్లను ఆపకపోవడంతో 18 గ్రామాల ప్రజలు అసెంబ్లీ ఎన్నికలను బహిష్కరిస్తున్నట్టు ప్రకటించారు. అన్ని గ్రామాలలో పోల్ బాయ్‌కాట్ బ్యానర్లు దర్శనమిస్తున్నాయి. నో ట్రెయిన్ హాల్ట్... నో వోట్స్... బ్యానర్లు చూసి బీజేపీ నేతలు తలలు పట్టుకుంటున్నారు. ప్రచారం చేపట్టేందుకు ఆ పార్టీ నాయకులు జంకుతున్నారు. చాలాకాలంగా తమ డిమాండ్ నెరవేర్చాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నా నేతలు పట్టించుకోకపోవడంతో ఈ సారి అసెంబ్లీ ఎన్నికలు బహిష్కరించాలని గట్టి నిర్ణయం తీసుకున్నారు. 'ట్రెయిన్ నహీ తో వోట్ నహీ' అంటూ అంచెలి రైల్వేస్టేషన్ సమీపంలో బ్యానర్లు వెలిశాయి. ఎన్నికల ప్రచారానికి ఏ రాజకీయ పార్టీలు రావొద్దు... మా డిమాండ్ నెరవేర లేదు... అందుకే ఎన్నికలను బహిష్కరిస్తున్నాం' అని బ్యానర్లపై స్పష్టంగా రాశారు. లోకల్ రైళ్లను ఆపకపోవడంతో 18 గ్రామాల ప్రజలు ముఖ్యంగా విద్యార్థులు, ఉద్యోగులు చాలా ఇబ్బందులకు గురవుతున్నారు. కార్యాలయాలు, కాలేజీలు, స్కూళ్లకు వెళ్లాలంటే నడిచి వెళ్లాల్సి వస్తుందని, రైళ్లను ఇక్కడ ఆపాలని అధికారుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదని కాలేజీ విద్యార్థి ప్రాచీ పటేల్ విచారం వ్యక్తం చేశారు. గతంలో ఇక్కడ రైళ్లు ఆగేవని, కరోనా సమయం నుంచి రైళ్లను నిలుపడం లేదని స్థానికులు చెబుతున్నారు.అందుకే ఎన్నికలను బహిష్కరించి ఖాళీ ఈవీఎంలను తిప్పిపంపి బీజేపీ ప్రభుత్వానికి, రైల్వే అధికారులకు సమస్యను తేటతెల్లం చేస్తున్నట్లు జెడ్ఆర్‌సీసీ సభ్యుడు చోటుభాయ్ పాటిల్ వివరించారు. ఎన్నికలు బహిష్కరించిన ఈ గ్రామాలు బీజేపీకి కంచుకోట. గత 27 ఏళ్లు గుజరాత్‌లో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దింపేందుకు ఆప్, కాంగ్రెస్ పార్టీలు కృతనిశ్చయంతో ఉన్నాయి.

ఎన్నికల్లో పోటీచేయడం లేదు: ప్రశాంత్ కిశోర్

పాట్నా : బీహార్‌లో మెరుగైన ప్రత్యామ్నాయాన్ని నిర్మిస్తానని ఎన్నికల ప్రచార వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ మరోసారి గట్టిగా చెప్పారు. స్వయంగా ఎన్నికల్లో పోటీ చేసే అవకాశాన్ని ఆయన తోసిపుచ్చారు. ఎన్నికల్లో ఎందుకు పోటీ చేయాలని ప్రశ్నిస్తూ, తనకు అటువంటి కోరికలు లేవన్నారు. జేడీయూపై విమర్శలు గుప్పించారు. ప్రశాంత్ కిశోర్ శనివారం పాట్నాలో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ, బీహార్ అధికార కూటమిలోని జేడీయూపై విరుచుకుపడ్డారు. మిడిమిడి రాజకీయ చతురతగల వ్యాపారి అని తనను జేడీయూ విమర్శించడంపై ఘాటుగా స్పందించారు. 'ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ రెండేళ్లపాటు తన నివాసంలో నాకు ఎందుకు స్థానం ఇచ్చారో ఆయనను ప్రశ్నించండి' అని జేడీయూ నేతలకు సవాల్ విసిరారు. మీరు ఎన్నికల్లో పోటీ చేస్తారా? అని విలేకర్లు పదే పదే అడిగినపుడు ప్రశాంత్ కిశోర్ స్పందిస్తూ, 'నేనెందుకు ఎన్నికల్లో పోటీ చేయాలి? నాకు అలాంటి కోరికలు లేవు" అని చెప్పారు. ఆయన ప్రస్తుతం జన సురాజ్ యాత్ర చేస్తున్నారు. దీనిని రాజకీయ పార్టీగా మార్చాలా? వద్దా? అని ప్రజలను ఆయన కోరారు. ప్రజాభిప్రాయ సేకరణ కోసం పశ్చిమ చంపారన్ జిల్లాలో ఆదివారం సమావేశం నిర్వహించబోతున్నారు. ఇటువంటి ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాలను అన్ని జిల్లాల్లోనూ నిర్వహిస్తామని తెలిపారు.

ప్రజల అభిప్రాయాలకు అనుగుణంగా భవిష్యత్తులో నిర్ణయం తీసుకుంటామన్నారు. జేడీయూలో చేరితే తనపై నితీశ్ కుమార్ మళ్లీ ప్రశంసల జల్లు కురిపిస్తారన్నారు. తాను స్వతంత్రంగా ఓ మార్గాన్ని ఎంచుకోవడం వల్ల నితీశ్, ఆయన మద్దతుదారులు తన పట్ల అసంతృప్తిగా ఉన్నారన్నారు. ప్రశాంత్ కిశోర్ ప్రారంభించిన జన సురాజ్ పాదయాత్ర బీహార్‌లో 3,500 కిలోమీటర్ల మేరకు జరుగుతుంది.

బ్రెయిన్‌డెడ్ చిన్నారి ఇద్దరికి ప్రాణదాత

- ఆరు నెలల్లో అవయవాలు దానం చేసిన మూడవ బిడ్డ
- ఎయిమ్స్ ప్రొఫెసర్ డాక్టర్ గుప్తా

న్యూఢిల్లీ: బ్రెయిన్ డెడ్ అయిన 18 నెలల చిన్నారి ఇద్దరికి ప్రాణ దాత అయింది. హరియాణా, మీవట్‌కు చెందిన మాహిరా ఈనెల 6న ఇంటి బాల్కనీ నుంచి కిందకు పడిపోయింది. అపస్మారక స్థితిలో ఉన్న ఆమెను హుటాహుటిన ఎయిమ్స్ ట్రౌమా సెంటర్‌కు తరలించారు. చిన్నారి మెదడు భాగం బాగా దెబ్బతిన్నది. ఈనెల 11వ తేదీ ఉదయానికి బ్రెయిన్‌డెడ్ అయినట్లు వైద్యులు ధ్రువీకరించారని ఎయిమ్స్ న్యూరోసర్జరీ ప్రొఫెసర్ డాక్టర్ దీపక్ గుప్తా తెలిపారు. దీంతో చిన్నారి అవయవాలను దానం చేయాలని ఆమె కుటుంబం నిర్ణయించింది. చిన్నారి కాలేయంతో ఇనిస్టిట్యూట్ ఆఫ్ లివర్, బైలయిరీ సైన్సెస్ (ఐఎల్‌బీఎస్) ఆరు నెలల బిడ్డకు కాలేయ మార్పిడి జరిగిందని, ఆమె రెండు మూత్రపిండాలతో ఎయిమ్స్‌లో 17ఏళ్ల బాలుడికి మూత్రపిండాల మార్పిడి జరిగిందని డాక్టర్ గుప్తా చెప్పారు. చిన్నారి శుక్లమండలం (కార్నియా), గుండె కావాటాలు (వాల్స్) భద్రపర్చినట్లు తెలిపారు. మూడు నెలల్లో ఎయిమ్స్ ట్రౌమా సెంటర్‌లో అవయవాలను దానం చేసిన మూడవ బిడ్డగా మాహిరా నిలిచింది. తొలుత రోలి ఆ తర్వాత 16 నెలల రిషాంత్ అవయవాలను ఆగస్టులో దానం చేశారు. 'కౌనెల్సింగ్ సమయంలో మాహిరా తల్లిదండ్రులకు రోలీ గురించి వైద్యులు తెలిపారు. బ్రెయిన్‌డెడ్ అంటే ఏమిటో వివరించారు. అవయవ దానం ప్రాధాన్యతను తెలియజేశారు. దీంతో మాహిరా అవయవాలు దానం చేసేందుకు వారు అంగీకరించారు' అని డాక్టర్ గుప్తా చెప్పారు. బుల్లెట్ గాయంతో ఆరేళ్ల రోలీ బ్రెయిన్‌డెడ్ కాగా ఆమె గుండె, కాలేయం, మూత్రపిండాలు, శుక్లాలు దానంచేశారు. ఎత్తు నుంచి కిందకు పడిపోవడమే పిల్లల మరణాలు దేశంలో ఎక్కువని ప్రొఫెసర్ డాక్టర్ గుప్తా తెలిపారు. ప్రతి ఇంటిలో బాల్కనీ ఎత్తును పిల్లల కంటే రెండింతలు పెంచితే ఇటువంటి ప్రమాదాలను నివారించే వీలు ఉంటుందని చెప్పారు. పిల్లలు బాల్కనీ రేలింగ్ ఎక్కి అక్కడ ఎటువంటి రక్షణ లేక జారి కింద పడి చనిపోతున్నారు. తలకు తీవ్రమైన గాయాలతో బాధపడుతున్నారు అని డాక్టర్ గుప్తా అన్నారు. అవయవ దానంపై పట్టణాల్లోనే కాకుండా గ్రామీణ ప్రాంతాల్లోనూ అవగాహన పెంచాల్సిన అవసరం ఉందని సూచించారు.

రిజర్వేషన్లు 77శాతం పెంచాలి: సీపీఐఎంఎల్ (ఎల్)

పాట్నా: బీహార్ అధికార కూటమిలోని సీపీఐఎంఎల్(ఎల్) అసెంబ్లీ శీతాకాల సమావేశాల్లో వివిధ వర్గాలకు అందించే మొత్తం రిజర్వేషన్లను పెంచేందుకు బిల్లును తీసుకురావాలని నితీశ్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. జార్ఖండ్ అసెంబ్లీలో ఆమోదించిన మాదిరిగానే 60 శాతం నుండి 77 శాతం చేయాలని కోరింది. మొత్తం రిజర్వేషన్ల పెంపు బిల్లును జార్ఖండ్ అసెంబ్లీ శుక్రవారం ఆమోదించినందున, బీహార్ ప్రభుత్వం కూడా శీతాకాల సమావేశాల్లో ఇదే విధమైన బిల్లును తీసుకురావాలని పార్టీ రాష్ట్ర కార్యదర్శి కునాల్ ఒక ప్రకటనలో తెలిపారు. బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో షెడ్యూల్డ్ కులాలు, ఇతర వెనుకబడిన తరగతులు, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు రిజర్వేషన్లు పెంచడానికి అనుకూలంగా ఉన్నారు. ఇదే సరైన తరుణం కాబట్టి బీహార్ ప్రభుత్వం ఈ దిశగా తక్షణ చర్యలు తీసుకోవాలి" అని ఆయన విజ్ఞప్తి చేశారు. బీహార్ అసెంబ్లీ శీతాకాల సమావేశాలు డిసెంబర్ రెండో వారంలో ప్రారంభం కానున్నాయి. 243 మంది సభ్యులున్న బీహార్ అసెంబ్లీలో సీపీఐఎంఎల్(ఎల్)కి 12 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు.

వచ్చే ఏడాది డిసెంబర్ నాటికి బాబ్రీ మసీదు నిర్మాణం పూర్తి

లక్నో: రామజన్మభూమి-బాబ్రీ మసీదు కేసులో సుప్రీంకోర్టు తీర్పుకు అనుగుణంగా అయోధ్యలో నిర్మిస్తున్న మసీదు నిర్మాణం వచ్చే ఏడాది డిసెంబర్‌లోగా పూర్తవుతుందని ఆ బాధ్యతను అప్పగించిన ట్రస్టు తెలిపింది. 'ఈ నెలాఖరులోగా అయోధ్య డెవలప్‌మెంట్ అథారిటీ నుండి ప్రతిపాదిత మసీదు, ఆసుపత్రి, కమ్యూనిటీ కిచెన్, లైబ్రరీ, రీసెర్చ్ సెంటర్ మ్యాప్‌నకు ఆమోదం లభిస్తుందని ఆశిస్తున్నాం. త్వరలో మసీదు నిర్మాణాన్ని ప్రారంభిస్తాం' అని ఇండో-ఇస్లామిక్ కల్చరల్ ఫౌండేషన్ ట్రస్ట్ కార్యదర్శి అథర్ హుస్సేన్ తెలిపారు. ధన్నీపూర్ అయోధ్య మసీదు నిర్మాణం డిసెంబర్ 2023 నాటికి పూర్తయ్యే అవకాశం ఉందని, ఐదెకరాల మౌల్వీ అహ్మదుల్లా షా కాంప్లెక్స్‌లో మిగిలిన నిర్మాణాలను తరువాత నిర్మిస్తామని ఆయన చెప్పారు. సుదీర్ఘకాలంగా నలుగుతున్న అయోధ్య వివాదంపై సుప్రీంకోర్టు తీర్పు వెలువరిస్తూ, ఒకప్పుడు బాబ్రీ మసీదు ఉన్న 2.77 ఎకరాల స్థలంలో రామమందిరాన్ని నిర్మించాలని, ఉత్తరప్రదేశ్‌లో మసీదు నిర్మాణానికి ఐదు ఎకరాలు కేటాయించాలని ఆదేశించింది. ఈ ఆలయానికి 'భూమి పూజ'ను ప్రధాని నరేంద్ర మోదీ ఆగస్టు 2020లో నిర్వహించారు. 2024లో ఆలయాన్ని ప్రారంభించే అవకాశం ఉందని ట్రస్ట్ చెబుతోంది. మసీదు నిర్మాణం కోసం ఉత్తరప్రదేశ్ సున్నీ సెంట్రల్ వక్ఫ్ బోర్డు ఏర్పాటు చేసిన ఇండో-ఇస్లామిక్ కల్చరల్ ఫౌండేషన్ ట్రస్ట్ ఆసుపత్రి, కమ్యూనిటీ కిచెన్, లైబ్రరీ, పరిశోధనా సంస్థను కూడా నిర్మించాలని నిర్ణయించింది.

'జీ20' కీలక సెషన్లలో మోదీ ప్రసంగం

న్యూఢిల్లీ: బాలిలో జరిగే జీ20 శిఖరాగ్ర సదస్సులో ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆహారం, ఇంధన భద్రత, డిజిటల్ పరివర్తన, ఆరోగ్యం అనే మూడు కీలక సెషన్లలో పాల్గొంటారని విదేశాంగ కార్యదర్శి వినయ్ క్వాత్రా ఆదివారం తెలిపారు. ఉక్రెయిన్ వివాదం... దాని పర్యవసానాలతో సహా ఒత్తిడితో కూడిన ప్రపంచ సవాళ్లపై విస్తృతంగా చర్చించే అవకాశం ఉన్న శిఖరాగ్ర సమావేశంలో పాల్గొనడానికి ప్రధాన మంత్రి సోమవారం ఇండోనేషియాలోని బాలి నగరానికి మూడు రోజుల పర్యటన కోసం బయలుదేరతారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ, ఇంధనం, పర్యావరణం, డిజిటల్ పరివర్తన తదితర అంశాలపై మోదీ, ఇతర నేతలు చర్చిస్తారని మీడియా సమావేశంలో క్వాత్రా చెప్పారు. ఈ సదస్సుకు అమెరికా అధ్యక్షుడు జో బైడెన్, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్, బ్రిటన్ ప్రధాని రిషి సునక్, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్, జర్మన్ ఛాన్సలర్ ఓలాఫ్ స్కోల్జ్ హాజరవుతున్నారు. కాగా కొన్ని జీ20 దేశాల నేతలతో మోదీ ద్వైపాక్షిక సమావేశాలు నిర్వహించనున్నట్లు క్వాత్రా తెలిపారు. ఇండోనేషియా అధ్యక్షుడు జోకో విడోడో ఆహ్వానం మేరకు ప్రధాని ఈ సదస్సుకు హాజరవుతున్నారు. ఇండోనేషియా ప్రస్తుతం జీ20 అధ్యక్ష స్థానంలో ఉంది. డిసెంబర్ 1 నుంచి జీ20 అధ్యక్ష పదవిని భారత్ అధికారికంగా చేపట్టనుంది.

ఢిల్లీ ఎల్జీ, సీఎం కార్యాలయాలకు సీఐసీ సమన్లు

న్యూఢిల్లీ: ఢిల్లీలోని మసీదుల ఇమామ్‌లకు ఆర్టీఐ చట్టం కింద చెల్లించే జీతభత్యాల సమాచారాన్ని వెల్లడించకపోవడంపై లెఫ్టినెంట్ గవర్నర్, ముఖ్యమంత్రి, ప్రధాన కార్యదర్శి కార్యాలయాల అధికారులకు కేంద్ర సమాచార కమిషన్ (సీఐసీ) సమన్లు పంపింది. కార్యకర్త సుభాష్ అగర్వాల్ విజ్ఞప్తిపై స్పందించిన సమాచార కమిషనర్ ఉదయ్ మహూర్కర్... ఢిల్లీ వక్ఫ్ బోర్డు అధికారులకు కూడా నోటీసులు జారీ చేశారు. ఢిల్లీ మసీదుల్లోని ఇమామ్‌లకు జీతాలు చెల్లించాలన్న నిర్ణయంపై ఫైల్ నోట్స్‌తో సహా పూర్తి సమాచారాన్ని అందించాల్సిందిగా సమాచార హక్కు చట్టం (ఆర్‌టీఐ) కింద తన దరఖాస్తు ద్వారా అగర్వాల్ కోరారు. దేశ రాజధానిలో ఇమామ్‌లు పొందే జీతాలు, మొత్తం మసీదుల సంఖ్య, మొత్తం ఖర్చు, వార్షిక వ్యయం, చెల్లింపులకు బాధ్యత వహించే సమర్థ అధికారం... సంబంధిత వివరాలను తెలపాలని ఆయన కోరారు. హిందూ దేవాలయాల పూజారులకు కూడా అలాంటి జీతాలు ఇస్తున్నారా అని అగర్వాల్ తన దరఖాస్తులో అడిగారు. ఆర్టీఐ దరఖాస్తుపై ఎల్‌జీ, ముఖ్యమంత్రి కార్యాలయాలు స్పందించకపోగా, ప్రధాన కార్యదర్శి కార్యాలయం దానిని రెవెన్యూ శాఖకు, ఢిల్లీ వక్ఫ్ బోర్డుకు బదిలీ చేసింది. కాగా వక్ఫ్ బోర్డు ఇచ్చిన సమాధానం అగర్వాల్ ప్రశ్నలకు సంబంధించింది కాదు. దీంతో ఈ రెండు శాఖల పబ్లిక్ ఇన్ఫర్మేషన్ అధికారులకు నవంబర్ 18న విచారణకు హాజరు కావాలని కమిషనర్ నోటీసులు కూడా జారీ చేశారు. ఈ వ్యవహారానికి సంబంధించిన అన్ని ఫైళ్లను విచారణకు తీసుకురావాలని సీఐసీ అధికారులను కోరింది. వక్ఫ్ బోర్డులు నిర్వహించే మసీదుల్లో పనిచేసే ఇమామ్‌లకు తగిన వేతనాలు చెల్లించాలని 1993లో సుప్రీంకోర్టు ఆదేశించిన సంగతి విదితమే.

ముంబైలోని ఓడలో నావికుడి ఆత్మహత్య

ముంబై: ముంబై హార్బర్‌లోని ఓ ఓడపై 25 ఏళ్ల నౌకాదళ నావికుడు తన సర్వీసు తుపాకీతో కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నట్టు ఆదివారం అధికారి ఒకరు తెలిపారు. ఈఘటన శనివారం మధ్యాహ్నం నౌకా దళానికి చెందిన యుద్ధ ఓడపై చోటుకుందని, దీనిపై విచారణకు ఆదేశించినట్టు పేర్కొన్నారు. నావికుడు ఓడలో విడిగా ఉన్న ఓ గదిలో ఆత్మహత్య చేసుకోవడంతో అక్కడికక్కడే మృతి చెందినట్టు వివరించారు. ఆత్మహత్యకు గల అసలు కారణలు ఇంకా తెలియరాలేదు. కుటుంబ పరమైన సమస్యలతో సతమతమవుతున్న తరుణంలో ఈ విధంగా ఆత్మహత్య చేసుకున్నాడని అధికారులు భావిస్తున్నారు. ప్రమాదశాత్తు మరణంగా కేసు నమోదు చేసినట్టు తెలిపారు. నావికాదళ అధికార ప్రతినిధి మాట్లాడుతూ ఘటనపై విచారణకు ఆదేశించినట్టు వివరించారు.

టికెట్ కోసం ఆప్ నేత వినూత్న నిరసన

న్యూఢిల్లీ: త్వరలో ఢిల్లీలో జరగనున్న మునిసిపల్ ఎన్నికల్లో టికెట్ ఇచ్చేందుకు అధిష్ఠానం నిరాకరించడంతో ఆమ్ ఆద్మీ పార్టీకి చెందిన మాజీ కౌన్సిలర్ హసీబ్-యుల్-హసన్ ఆదివారం తూర్పు ఢిల్లీలోని విద్యుత్ స్తంభం ఎక్కినట్టు పోలీసులు తెలిపారు. గాంధీనగర్ ప్రాంతంలో ఓ వ్యక్తి విద్యుత్ స్తంభం ఎక్కినట్టు తమకు ఉదయం 10.51 నిమిషాలకు ఫోన్ వచ్చిన అగ్నిమాపక అధికారులు తెలిపారు. పోలీసు సిబ్బంది, అగ్నిమాపక అధికారులు, అంబులెన్స్‌లు ఘటనా స్థలానికి చేరుకుని హసన్‌ను కిందకు దిగమని కోరగా, మొదటి నిరాకరించినా, చివరకు ఒప్పుకున్నాడని పోలీసులు పేర్కొన్నారు. ఎన్నికల్లో పాల్గొనే అభ్యర్థుల మొదటి జాబితాను ఆప్ శుక్రవారం విడుదల చేయగా, శనివారం రెండోజాబితా విడుదల చేసింది. 250 వార్డులున్న ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలు డిసెంబర్ 4న జరగనున్నాయి.

పుస్తకాలకు పెట్టింది పేరు విశాలాంధ్ర బుక్‌హౌస్

- భారీ పరిశ్రమలు, ఐటీశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ప్రశంస
- విశాఖలో పుస్తక మహోత్సవం ప్రారంభం

విశాలాంధ్ర-విశాఖ: పాఠకులకు అనేక రకాల పుస్తకాలను అందుబాటులోకి తేవడంలో విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ చేస్తున్న కృషి ప్రశంసనీయమని రాష్ట్ర భారీ పరిశ్రమలు, ఐటీశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. టర్నర్ చౌల్ట్రి ఆవరణలో విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ ఏర్పాటు చేసిన 21వ విశాఖ పుస్తక మహోత్సవాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ... పుస్తక ప్రియులు ఎక్కడకు వెళ్లినా విశాలాంధ్ర బుక్‌హౌస్ కోసం ఆరా తీస్తారని అన్నారు. తాను కూడా అనేక సార్లు విశాలాంధ్ర బుక్‌హౌస్‌లో పుస్తకాలు కొనుగోలు చేశానని చెప్పారు. విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ అందరికీ తెలిసిన సంస్థ అన్నారు. అనేక అనువాద పుస్తకాలు కూడా విశాలాంధ్ర బుక్‌హౌస్‌లో లభ్యం కావడం దాని ప్రత్యేకత అని అభినందించారు. పుస్తకాలు సమాజంలో మార్పు తీసుకొస్తాయని అభిప్రాయ పడ్డారు. రాంనగర్ లోని వీఎంఆర్ డీఏ కొత్తగా నిర్మించిన వాణిజ్య సముదాయంలో విశాలాంధ్ర బుక్ హౌస్‌కి దుకాణం కేటాయించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ... విశాలాంధ్ర బుక్ హౌస్ కి రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల లైఫ్ టైం అఛీవ్‌మెంట్ అవార్డును ప్రదానం చేసిందని చెప్పారు. కరోనా కారణంగా రెండు సంవత్సరాలు పుస్తక ప్రదర్శనను నిర్వహించలేకపోయినట్లు తెలిపారు. ఆంగ్ల భాష వైపు ప్రజలు మొగ్గుచూపుతున్న పరిస్థితుల్లో తెలుగుసాహిత్యాన్ని ముందుకు తీసుకు వెళ్లేందుకు విశాలాంధ్ర బుక్ హౌస్ మొదటి నుంచి కృషి చేస్తోందని చెప్పారు. కేజీహెచ్ పర్యవేక్షణాధికారిణి డాక్టర్ మైథిలి మాట్లాడుతూ... పుస్తకాల కోసం తాను తొలుత వెతికేది విశాలాంధ్ర బుక్ హౌస్‌లోనే అని చెప్పారు. పుస్తకానికి ప్రత్యామ్నాయం లేదన్నారు. కంప్యూటర్లు వచ్చిన తరువాత పుస్తక పఠనం తగ్గినా పఠనంలో ఉండే ఆనందం వేరని అభిప్రాయపడ్డారు. విశాలాంధ్ర బుక్ హౌస్ మరిన్ని శాఖలను ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హిందూ దినపత్రిక ప్రిన్సిపల్ కరస్పాండెంట్ సుమిత్ భట్టాచార్జి, విశాలాంధ్ర పబ్లిషింగ్‌హౌస్ మేనేజర్ టి.మనోహర్‌నాయుడు, విశాఖపట్నం బుక్‌హౌస్ మేనేజర్ పీపీ రాజు, సీపీఐ జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు, 30వ వార్డు కార్పొరేటర్ కోడూరి అప్పల రత్నం, వార్డు వైసీపీ ఇన్‌చార్జి పెద్దపిల్లి సత్యనారాయణ, సీపీఐ కార్పొరేటర్ ఏజే స్టాలిన్, అరసం రాష్ట్ర కార్యదర్శి ఉప్పల అప్పలరాజు, విశాఖ జిల్లా ఉపాధ్యక్షురాలు అయ్యగారి సీతారత్నం, విజయనగరం జిల్లా అధ్యక్షుడు జి.చలం, సాహితీవేత్తలు రొక్కం కామేశ్వరరావు, మధుసూదనరావు, విశాఖ రచయితల సంఘం అధ్యక్షుడు అడపా రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

19న పోర్టు కార్మికుల ధర్నా

విశాలాంధ్ర-విశాఖ: పోర్టు కార్మికుల సమస్యల పరిష్కారానికి 19న అన్ని పోర్టుల వద్ద ధర్నాలు చేయాలని దేశంలోని 11 ప్రధాన పోర్టుల్లోని ఐదు ఫెడరేషన్లు నిర్ణయించాయి. విశాఖలో ఈ కమిటీ సమావేశం 12, 13 తేదీల్లో జరిగింది. ఈ సమావేశంలో రేవు కార్మికుల సమస్యల పరిష్కారానికి నేషనల్ కో ఆర్డినేషన్ కమిటీని ఏర్పాటు చేసుకున్నారు. కమిటీలో హెచ్ఎంఎస్, హెచ్ఎంఎస్ (వర్కర్), ఐఎన్‌టీయూసీ, ఏఐటీయూసీ, సీఐటీయూల నుంచి ప్రధాన నాయకులు పాల్గొన్నారు. 1963లో మేజర్ పోర్టుల చట్టం ద్వారా పోర్టులు అభివృద్ధి చెందాయని అభిప్రాయపడ్డారు. అయితే 2021లో ప్రధాన పోర్టు అథారిటీ ద్వారా వచ్చిన పోర్టుల అధికారాలు కేంద్ర ప్రభుత్వం పరిధిలోకి వెళ్లిపోయాయని పేర్కొన్నారు. దీని ద్వారా ప్రయివేటు పోర్టులను లాభాల్లోకి తీసుకువచ్చి మేజర్ పోర్టులను నష్టాల్లోకి నెట్టారని విమర్శించారు. 1993లో 1,90,000 కార్మికులు ఉండగా నేడు 20,000మంది కార్మికులున్నారన్నారు. పర్మినెంట్ కార్మికులు చేయాల్సిన పనులు కాంట్రాక్టు కార్మికులు చేస్తున్నారని తెలిపారు. పీఎల్ఆర్ బోనస్ త్వరగా ఫైనల్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ నుంచి బీసీహెచ్. మసేన్, చైర్మన్ పీకే సామంతరే, జనరల్ కన్వీనర్ పీఎం మహమ్మద్ హనీఫ్, హెచ్ఎంఎస్ నుంచి జీఎం కృష్ణమూర్తి, డీకే శర్మ, డిప్యూటీ కన్వీనర్ టి.నరేంద్రరావు, సీఐటీయూ నుంచి సీడీ నందకుమార్, ఏఐటీయూసీ నుంచి ఎస్ ఎస్ శరవణన్, ఐఎన్‌టీయూసీ నుంచి ఎ.బలరామన్, హెచ్ఎంఎస్ నుంచి ఎల్ సత్యనారాయణన్, ఏఐటీయూసీ నుంచి వైఎస్ ప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

80 నాటి తారల రీ యూనియన్

ముంబై: 1980ల్లో వెండితెరను ఏలిన దక్షిణాది, ఉత్తరాది నటీనటులు ఒకేచోట కలిశారు. అలనాటి రోజుల్ని, మధుర జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఆటలు ఆడారు... పాటలు పాడారు.. హుషారైన పాటలకు డాన్సులు వేశారు. ఒక్కో ఏడాది ఒక్కో స్టార్ ఈ వేడుకలకు ఆతిథ్యం ఇస్తున్నారు. ఈ ఏడాది జరిగిన 11వ రీయూనియన్ వేడుకకు బాలీవుడ్ నటుడు జాకీ ష్రాఫ్, పూనమ్ ధిల్లాన్ ఆతిథ్యమిచ్చారు. ముంబైలో జరిగిన ఈ వేడుకల్లో చిరంజీవి, వెంకటేశ్, నదియా, సరిత, రమ్యకృష్ణ, విద్యాబాలన్, ఖుష్బూ, సుహాసిని, సుమలత, జయప్రద, మధుబాల, అంబిక, లిజీ, రేవతి, రాధ, శోభన, సుమలత, అనుపమ్ ఖేర్, శరత్‌కుమార్, నరేశ్, అనిల్ కపూర్, భానుచందర్, అర్జున్, రాజ్‌కుమార్ సేతుపతి ఇలా 30 మంది తారలు ఒకే చోట సందడి చేశారు. హుషారైన పాటలకు స్టెప్పులేశారు. నటి సుమలత 'డాన్' చిత్రంలోని 'ఏ మేరా దిల్ ప్యార్‌కా దీవానా' అంటూ పాట పాడారు. సుహాసిని, లిజీ, అర్జున్ 'నాక్క ముక్క' పాటకు స్టెప్పులేశారు. ప్రస్తుతం ఈ ఫొటోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. కరోనాకు ముందు 2020లో జరిగిన 10వ రీయూనియన్ సెలబ్రేషన్స్‌కు మెగాస్టార్ చిరంజీవి ఆతిథ్యం ఇచ్చారు. అంతకుముందు ఊటీ, చెన్నై తదితర ప్రాంతాల్లో ఈ వేడుక జరిగింది.

స్క్రిప్ట్ దశలో 'ఆర్ఆర్ఆర్-2'

హైదరాబాద్: దర్శకధీరుడు ఎస్ఎస్. రాజమౌళి దర్శకత్వం వహించిన సినిమా 'ఆర్ఆర్ఆర్'. జూనియర్ ఎన్టీఆర్, రామ్ చరణ్ హీరోలుగా నటించారు. ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద సంచలన విజయం సాధించింది. భారీ స్థాయిలో వసూళ్లను రాబట్టింది. ప్రపంచవ్యాప్తంగా ఈ చిత్రం రూ.1200కోట్లకు పైగా కలెక్షన్స్‌ను కొల్లగొట్టింది. 'ఆర్ఆర్ఆర్' హిందీ వెర్షన్ నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ కావడం ప్రారంభమైన తర్వాత ఈ సినిమాపై విదేశీ ప్రేక్షకులు ప్రశంసల వర్షం కురిపించారు. రాజమౌళిని పొగడ్తలతో ముంచెత్తారు. వెస్టన్ ఆడియన్స్‌ను చిత్రం ఆకట్టుకోవడంతో 'ఆర్ఆర్ఆర్' ఆస్కార్ బరిలో నిలిచింది. వివిధ కేటగిరీల్లో పురస్కారం కోసం పోటీపడుతోంది. తాజాగా 'ఆర్ఆర్ఆర్' స్క్రీనింగ్‌ను చికాగోలో ఏర్పాటు చేశారు. ఈ ప్రదర్శనకు పెద్ద ఎత్తున అభిమానులు తరలి వచ్చారు. మూవీ స్క్రీనింగ్ అనంతరం క్వశ్చన్ అండ్ అన్సర్ సెషన్‌లో జక్కన్న పాల్గొన్నాడు. అందులో భాగంగా 'ఆర్ఆర్ఆర్' సీక్వెల్‌పై స్పందించాడు. చికాగోలో జరిగిన ఈవెంట్‌లో 'ఆర్ఆర్ఆర్ 2' పై రాజమౌళి మాట్లాడాడు. "నా అన్ని సినిమాలకు మా నాన్నే స్టోరీ రైటర్‌గా పనిచేశాడు. 'ఆర్ఆర్ఆర్' సీక్వెల్‌పై మా నాన్నతో చర్చించాను. ప్రస్తుతం కథపై పనిచేస్తున్నాడు" అని జక్కన్న తెలిపాడు.

మోదీ హయాంలో

రాజ్యాంగ స్ఫూర్తికి విఘాతం

- 'డిసెంబరు 6' రాజ్యాంగ పరిరక్షణ దినం
- ఏపీ లౌకిక రాజ్యాంగ పరిరక్షణ వేదిక తీర్మానం
- విజయవాడలో వివిధ వర్గాల ప్రముఖులతో భారీ సదస్సు
- వేదిక చైర్మన్ జల్లి విల్సన్, కన్వీనర్ కేఎస్ లక్ష్మణరావు వెల్లడి

విశాలాంధ్రబ్యూరో-అమరావతి: బాబ్రీ మసీదు కూల్చివేత జరిగిన డిసెంబరు 6వ తేదీని లౌకిక రాజ్యాంగ పరిరక్షణ దినంగా పాటించాలని ఆంధ్రప్రదేశ్ లౌకిక రాజ్యాంగ పరిరక్షణ వేదిక నిర్ణయించింది. విజయవాడలోని దాసరిభవన్‌లో వేదిక అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ అధ్యక్షతన ఆదివారం జరిగిన సమావేశం ఈ మేరకు ఏకగ్రీవంగా తీర్మానించింది. ఈ సమావేశానికి వివిధ ప్రాంతాల నుంచి దళిత, బడుగు, బలహీన, మైనార్టీ వర్గాల నాయకులు, ప్రతినిధులు, న్యాయవాదులు, మేధావులు హాజరై... మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న రాజ్యాంగ విరుద్ధ చర్యల్ని తీవ్రంగా వ్యతిరేకించారు. అనంతరం మీడియాతో జల్లి విల్సన్ మాట్లాడుతూ... 1992, డిసెంబరు 6వ తేదీన బాబ్రీ మసీదు కూల్చివేతను నిరసిస్తూ ఎంబీ విజ్ఞాన కేంద్రంలో భారత రాజ్యాంగ పరిరక్షణ కోసం వేదిక అధ్వర్యంలో తలపెట్టిన సదస్సుకు వివిధ వర్గాల నుంచి ప్రతినిధులను సమీకరించి, ఘనంగా విజయవంతం చేయాలని సమావేశం నిర్ణయించిందన్నారు. కేంద్రంలో మోదీ నాయకత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దళితులు, మహిళలపైన దాడులు పెరిగాయని, వాటిని నిరసిస్తూ దేశ వ్యాప్తంగా దళితులు నిరసనలకు దిగారని, బంద్‌లు నిర్వహించారని గుర్తుచేశారు. ఇక రెండోసారి మోదీ అధికారం చేపట్టాక కశ్మీర్ వ్యవహారంలో, బాబ్రీ మసీదుపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు విషయంలో కేంద్రం అప్రజాస్వామికంగా వ్యవహరించిందన్నారు. ఇప్పుడు ప్రజల మధ్య విభజన సృష్టిస్తున్నారనీ, హిందువుల పక్షాన బీజేపీ, ఆర్ఎస్ఎస్ మాత్రమే ఉంటాయనేలా మోదీ సర్కారు వ్యవహరిస్తోందన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగ స్ఫూర్తిని కేంద్ర ప్రభుత్వం కాలరాస్తోందని తప్పుపట్టారు. మోదీ ప్రభుత్వంలో సంక్షేమం, సామాజిక న్యాయం, లౌకికవాద ప్రజాస్వామ్య పరిరక్షణ ఎక్కడా కన్పించడం లేదని ఆందోళన వ్యక్తంచేశారు. అందుకోసమే రాజ్యాంగాన్ని రక్షించుకోవాల్సిన అవసరం, దానిని సక్రమంగా అమలు చేసుకోవాల్సిన బాధ్యతను తెలిపేందుకు ఆంధ్రప్రదేశ్ లౌకిక రాజ్యాంగ పరిరక్షణ వేదిక అధ్వర్యంలో డిసెంబరు 6న సదస్సు నిర్వహించనున్నామనీ, దాని విజయవంతానికి అందరూ సహకరించాలని విల్సన్ కోరారు.

వేదిక కన్వీనర్, ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ... భారత రాజ్యాంగ లక్ష్యాలకు, ఆశయాలకు, స్ఫూర్తికి విఘాతం కలిగే విధంగా కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. రాజ్యాంగ ఆశయాలైన సమాఖ్య విధానాన్ని, లౌకిక విధానాన్ని, భావ ప్రకటనా స్వేచ్ఛను, పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీస్తోందని విమర్శించారు. స్వతంత్రంగా పనిచేయాల్సిన న్యాయ వ్యవస్థలను సైతం లొంగతీసుకునే ప్రయత్నాలకు మోదీ ప్రభుత్వం పాల్పడుతోందన్నారు. రాజ్యాంగాన్ని రక్షించాల్సిన బాధ్యత దేశ పౌరులందరిపైనా ఉందని తెలిపారు. దీంతో రాజ్యాంగ పరిరక్షణ వేదిక-ఆంధ్రప్రదేశ్ కమిటీ అధ్వర్యంలో డిసెంబరు 6వ తేదీన విజయవాడలో నిర్వహించనున్న సదస్సుకు వివిధ రంగాల జాతీయ, రాష్ట్ర స్థాయి ప్రముఖులను ఆహ్వానించబోతున్నామని చెప్పారు. ఈ సమావేశంలో లౌకిక రాజ్యాంగ పరిరక్షణ వేదిక రాష్ట్ర నాయకుడు ఏంఏ గఫూర్, ప్రముఖ న్యాయవాది అబ్దుల్ మతీన్, ఇన్సాఫ్ రాష్ట్ర కన్వీనర్ సయ్యద్ అఫ్సర్, సీనియర్ జర్నలిస్ట్ ఎండీ షఫీ అహ్మద్, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్, డీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జేవీ ప్రభాకర్, కరవది సుబ్బారావు, ఉపాధ్యక్షుడు తాటిపాక మధు, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ బుట్టి రాయప్ప, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్సన్‌బాబు, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు తుపాకుల నాగేశ్వరరావు, బండి వెంకటేశ్వరరావు, ఆర్.వెంకట్రావ్, సి.సుబ్రహ్మణ్యం, చిలుకూరి వెంకటేశ్వరరావు, కాబోతు ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కొలీజియంపై విమర్శలు తగవు

మాజీ సీజేఐ టీఎస్ ఠాకూర్

న్యూఢిల్లీ: భారతదేశంలో ఉన్నత న్యాయ వ్యవస్థకు న్యాయమూర్తుల నియామకం కోసం ఏర్పాటైన కొలీజియం వ్యవస్థను విమర్శించడాన్ని భారత మాజీ ప్రధాన న్యాయమూర్తి టీఎస్ ఠాకూర్ తప్పుబట్టారు. దేశ రాజధానిలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ... 'కొలీజియం వ్యవస్థ సరైనది కాదని రోజూ ఎవరో ఒకరు అంటున్న మాటలు మీరు చదువుతునే ఉంటారు... న్యాయమూర్తుల నియామకానికి కొలీజియం వ్యవస్థ అత్యంత పరిపూర్ణమైన వ్యవస్థ అని ఎవరూ చెప్పలేరు... అయితే ప్రధాన న్యాయమూర్తి ఇటీవల ప్రస్తావించినట్లుగా కొలీజియం వ్యవస్థను మెరుగుపరుచుకోవచ్చు' అని ఠాకూర్ అన్నారు. వ్యవస్థను మెరుగుపరిచే ప్రయత్నానికి వ్యతిరేకంగా ఎవరైనా వాదించగలరని నేనుకోవడంలేదని ఆయన అభిప్రాయపడ్డారు. సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తులను ఎంపిక చేసేందుకు నేషనల్ జ్యూడీషియల్ అపాయింట్‌మెంట్స్ కమిషన్‌ను తీసుకురావడానికి రాజ్యాంగ సవరణను సుప్రీం కోర్టు కొట్టివేయడాన్ని కూడా ఆయన ప్రస్తావించారు. దాదాపు ఏకాభిప్రాయంతో పార్లమెంటు ఆమోదించిన చట్టం కొలీజియం వ్యవస్థను రద్దు చేయాలని కోరింది. 'కోర్టులో పరీక్షించగా.. న్యాయవ్యవస్థ స్వాతంత్ర్యానికి భంగం కలిగిస్తోందని కోర్టు గుర్తించింది... అదే పని చేయడానికి మరో అవకాశం ఉంటే లేదా అన్ని విధాలుగా మరో మార్గం ఉంటే దయచేసి అలా చేయండి' ఆయన అభిప్రాయపడ్డారు.

నేరుగా వచ్చే తెలుగు సినిమాలకే ప్రాధాన్యం

తెలుగు చలనచిత్ర పరిశ్రమ

హైదరాబాద్: ఏపీ, తెలంగాణలోని ఎగ్జిబిటర్లకు తెలుగు చలనచిత్ర నిర్మాతల మండలి లేఖ రాసింది. వచ్చే ఏడాది సంక్రాంతి, దసరాకు నేరుగా తెలుగు సినిమాల ప్రదర్శనకే ప్రాధాన్యత ఇవ్వాలని సూచించింది. ఈ మేరకు 2017లో తెలుగు చలనచిత్ర వాణిజ్య మండలి నిర్ణయం తీసుకుందని తెలిపింది. నేరుగా తెలుగు సినిమాలు ఉండగా, డబ్బింగ్ చిత్రాలకు థియేటర్లు ఎలా ఇస్తామంటూ గతంలో ప్రముఖ నిర్మాత దిల్ రాజు పేర్కొన్న విషయాన్ని ఈ సందర్భంగా చలన చిత్ర నిర్మాతల మండలి గుర్తు చేసింది. ఈ నిర్ణయాన్ని ఎగ్జిబిటర్లు పాటించాలని కోరింది. తెలుగు చిత్ర పరిశ్రమను కాపాడుకునేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది.

సీపీఐ సీనియర్ నాయకులు కాంతారావు కన్నుమూత

విశాలాంధ్ర-నరసరావుపేట: పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేట పట్టణానికి చెందిన సీపీఐ సీనియర్ నాయకులు, న్యాయవాది చేకూరి లక్ష్మీ కాంతారావు(91) అనారోగ్యంతో విజయవాడలోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందారు. ఆయన 1965లో పీడబ్ల్యూడీ వర్క్‌షాప్ కెనాల్స్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 1981లో నరసరావుపేట మున్సిపల్ కౌన్సిలర్‌గా పనిచేశారు. జిల్లా కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా విధులు నిర్వహించారు. ఒకవైపు పార్టీలో తీరిక లేకుండా ఉద్యమాలు చేస్తూ మరోవైపు న్యాయవాదిగా అన్ని వర్గాలకు సేవలందించారు. కార్మికుల తరపున కేసులు వాదించి వందలాది మంది కార్మికులను పర్మినెంట్ చేయించారు. కాంతారావు భౌతికకాయాన్ని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, టీడీపీ ఇంచార్జ్ డాక్టర్ అరవింద్ బాబు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జంగాల అజయ్ కుమార్, నాయకులు వై.చెంచయ్య, పల్నాడు జిల్లా కార్యదర్శి ఏ.మారుతి వరప్రసాద్, సహాయ కార్యదర్శి షేక్ హుస్సేన్, కాసా రాంబాబు, గుంటూరు నగర కార్యదర్శి కోట మాల్యాద్రి, సీనియర్ నాయకులు షేక్ బుడే, రైతు సంఘం నాయకులు రమేష్, బూదాల శ్రీనివాసరావు, ఎస్టీయూ నాయకులు సుభాని, సత్తెనపల్లి నియోజకవర్గ ఏరియా కమిటీ కార్యదర్శి నరిశెట్టి వేణుగోపాల్, మాచర్ల నియోజకవర్గ కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, చిలకలూరిపేట నియోజకవర్గ నాయకులు సుబ్బాయమ్మ, బాబురావు, నాయుడు శివ, నిర్మల, జనసేన నాయకులు జీవీఎస్ ప్రసాద్, నాగరాజు, పలువురు సీనియర్ న్యాయవాదులు, డాక్టర్లు, పట్టణ ప్రముఖులు సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ముప్పాళ్ల మాట్లాడుతూ కార్మిక, పేదల పక్షపాతిగా పెత్తందారి విధానానికి వ్యతిరేకంగా పోరాడిన ధీరుడు కాంతారావు అని కొనియాడారు. భూస్వామ్య వర్గాలకు వ్యతిరేకంగా పల్నాడు ప్రాంతంలో జరిగిన అనేక పోరాటాల్లో నిర్భీతిగా పాల్గొన్న నాయకుడు కాంతారావు అని అన్నారు. ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

నారాయణ సంతాపం: ప్రముఖన్యాయవాదిగా, కమ్యూనిస్టు పార్టీ, కార్మిక నాయకుడు కాంతారావు మృతికి సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టరు కె. నారాయణ సంతాపం తెలిపారు. గుంటూరు జిల్లా విద్యార్థి ఉద్యమం తాను పనిచేసినప్పటి నుంచి కాంతారావుతో పరిచయం వుందని తెలిపారు. ఎప్పుడు కనపడినా ఆప్యాయంగా పలకరించడమేకాక, తన కర్యక్రమాలను ప్రోత్సహించేవారని గుర్తుచేసుకున్నారు. కాంతారావు కుటుంబ సభ్యులకు నారాయణ సంతాపం తెలిపారు.

రామకృష్ణ తదితరుల సంతాపం: కాంతారావు మృతికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ సంతాపం తెలిపారు. వారి కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్, ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు రావులపల్లి రవీంద్రనాథ్ కూడా కాంతారావు మృతికి సంతాపం తెలిపారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఆయన అలుపెరగని పోరాటాల చేశారని కొనియాడారు. వారి కుటుంబ సభ్యులకు సానుభూతి వ్యక్తం చేశారు.

టీ20 విశ్వవిజేత ఇంగ్లండ్

- ఐదు వికెట్ల తేడాతో ఘనవిజయం
- ఫైనల్లో పాక్ కొంపముంచిన అఫ్రిది గాయం

మెల్‌బోర్న్: టీ20 ప్రపంచకప్‌లో ఇంగ్లండ్ ఛాంపియన్‌గా నిలిచింది. పాకిస్తాన్‌తో ఆదివారం జరిగిన ఫైనల్లో ఇంగ్లండ్ ఐదు వికెట్ల తేడాతో గెలుపొంది రెండోసారి టైటిల్‌ను ముద్దాడింది. మరోసారి బెన్ స్టోక్స్(49 బంతుల్లో 5 ఫోర్లు, సిక్స్ 52 నాటౌట్) అజేయ హాఫ్ సెంచరీతో రాణించి బిగ్ మ్యాచ్ ప్లేయర్ ట్యాగ్‌ను నిలబెట్టుకున్నాడు. 2016 టీ20 ప్రపంచకప్ ఫైనల్లో విలన్‌గా తీవ్ర విమర్శలు ఎదుర్కొన్న స్టోక్స్.. తాజా ఇన్నింగ్స్‌తో వాటిని తుడిపేసుకున్నాడు.



చెలరేగిన సామ్ కరన్

ఈ మ్యాచ్ ముందుగా బ్యాటింగ్ చేసిన పాకిస్తాన్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లకు 137 పరుగులు మాత్రమే చేసింది. షాన్ మసూద్(28 బంతుల్లో 2 ఫోర్లు, సిక్స్‌తో 38), బాబర్ ఆజామ్(28 బంతుల్లో 2 ఫోర్లతో 32), షాదాబ్ ఖాన్(14 బంతుల్లో 2 ఫోర్లతో 20) మినహా అంతా విఫలమయ్యారు. ఇంగ్లండ్ బౌలర్లలో సామ్ కరన్ మూడు వికెట్లకు తోడుగా.. ఆదిల్ రషీద్, క్రిస్ జోర్డాన్ రెండు వికెట్లు తీశారు. బెన్ స్టోక్స్‌కు ఓ వికెట్ దక్కింది.

శుభారంభం లేకున్నా...

138 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఇంగ్లండ్‌కు ఆదిలోనే గట్టి షాక్ తగిలింది. షాహిన్ షా అఫ్రిది వేసిన ఇన్నింగ్స్ ఫస్ట్ ఓవర్‌లోనే డేంజరస్ బ్యాటర్ అలెక్స్ హేల్స్(1) క్లీన్ బౌల్డ్ అయ్యాడు. క్రీజులోకి ఫిల్ సాల్ట్ రాగా.. జోస్ బట్లర్ ధాటిగా ఆడే ప్రయత్నం చేశాడు. కానీ హారీస్ రౌఫ్ తన వరుస ఓవర్లలో ఫిల్ సాల్ట్, జోస్ బట్లర్‌ను పెవిలియన్ చేర్చాడు. దాంతో ఇంగ్లండ్ పవర్ ప్లేలో 3 వికెట్లకు 49 పరుగులు చేసింది. క్రీజులోకి వచ్చిన హరీ బ్రూక్, బెన్ స్టోక్స్ నిదానంగా ఆడుతూ ఇన్నింగ్స్ చక్కదిద్దారు. క్రీజులో కుదురుకున్న ఈ జోడీని షాదాబ్ ఖాన్ విడదీశాడు. సూపర్ బాల్‌తో హారీ బ్రూక్(20)ను పెవిలియన్ చేర్చాడు. అయితే ఈ క్యాచ్ అందుకునే క్రమంలో షాహిన్ షా అఫ్రిది గాయపడ్డాడు.

మలుపు తిప్పిన గాయం..

ఆ తర్వాత పాక్ బౌలర్లు కట్టడిగా బౌలింగ్ చేయడంతో ఇంగ్లండ్ తీవ్ర ఒత్తిడికి గురైంది. కానీ ఇఫ్తికర్ అహ్మద్ వేసిన 16వ ఓవర్‌లో బెన్ స్టోక్స్.. 4, 6 బాది మ్యాచ్‌ను మలుపు తిప్పాడు. ఇక మహమ్మద్ వసీం జూనియర్ వేసిన మరుసటి ఓవర్‌లో మోయిన్ అలీ మూడు బౌండరీలు బాది ఇంగ్లండ్ పనిని మరింత సులువు చేశాడు. హారీస్ రౌఫ్ 18వ ఓవర్‌లో 5 పరుగులే ఇవ్వడంతో చివర్ ఓవర్‌లో ఇంగ్లండ్ విజయానికి 8 పరుగులు అవసరమయ్యాయి. మహమ్మద్ వసీం జూనియర్ వేసిన 19వ ఓవర్‌లో మోయిన్ అలీ(19) క్లీన్ బౌల్డ్ అయ్యాడు. ఈ ఓవర్ నాలుగో బంతిని బౌండరీ బాదిన స్టోక్స్ 47 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఈ ఓవర్ చివరి బంతిని సింగిల్ తీసిన స్టోక్స్.. ఇంగ్లండ్ విజయ లాంఛనాన్ని పూర్తి చేశాడు.

బెన్ స్టోక్స్‌కు అండగా...

అనంతరం లక్ష్యఛేధనకు దిగిన ఇంగ్లండ్ 19 ఓవర్లలో 5 వికెట్లకు 138 పరుగులు చేసింది. బెన్ స్టోక్స్‌కు అండగా జోస్ బట్లర్(17 బంతుల్లో 3 ఫోర్లు, సిక్స్‌తో 26), మొయిన్ అలీ(12 బంతుల్లో 3 ఫోర్లతో 19) రాణించారు. పాకిస్తాన్ బౌలర్లలో హరీస్ రౌఫ్ రెండు వికెట్లు తీయగా.. షాహిన్ షా అఫ్రిది, షాదాబ్ ఖాన్, మహమ్మద్ వసీం తలో వికెట్ తీశారు. కీలక సమయంలో షాహిన్ షా అఫ్రిది గాయపడటం పాక్ విజయవకాశాలను దెబ్బతీసింది.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.